RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 174 పేజీలు - 08 గురువారం 21 మే 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## ప్రభుత్వ రాయితీ పొందిన ఆస్పత్రులకు హెచ్చరిక

- పేధలకు ఉచిత వైద్యం అందించాల్సిందే అన్న సుప్రీం




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మే 20:** సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ భూములను రాయితీ ధరలకు పొందిన ప్రైవేట్ ఆస్పత్రులు ఆర్థికంగా బలహీన వర్గాలకు తప్పనిసరిగా ఉచిత వైద్య సేవలు అందించాలని స్పష్టం చేసింది. మిగతా2లో...

## ఇటలీలో పీఎం మోడీ



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మే 20:** పలు రోజుల నుంచి విదేశీ పర్యటనలతో పీఎం మోడీ చక్కర్లు కొడుతున్నారు. తాజాగా ఇటలీలోని రోమ్‌లో ప్రధానమంత్రి అడుగుపెట్టగా , ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ఆయనకు స్వాగతం పలికారు. భారత్– ఇటలీ సంబంధాల బలోపేతమే లక్ష్యంగా ఇరువురి నేతల మధ్య చర్చలు జరగనున్నాయి. పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ తనకు 'మెలోడీ' టాఫీల (చాక్లెట్ల) ప్యాకెట్‌ను బహుమతిగా ఇస్తున్న వీడియోను మెలోని స్వయంగా షేర్ చేశారు. మిగతా2లో...



## సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం

**పుతిన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మే 20:** భారత్‌లో ఈ ఏడాది సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్నది. దీనికి రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ హాజరుకానున్నట్టు తెలుస్తోంది. న్యూఢిల్లీ వేదికగా జరగనున్న ఈ సమావేశాలకు పుతిన్ హాజరవుతారని దక్షిణాఫ్రికాలోని రష్యా ఎంబసీ ధ్రువీకరించినట్టు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. జిన్‌పింగ్ కూడా ఈ సమా వేశాలకు హాజరయ్యే అవకాశాలు మెండుగా మిగతా2లో...

## నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ

● అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతుల కల్పన ● పరిశ్రమల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్,మే 20:** ఫ్యూచర్ సిటీల పరిశ్రమల ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులుకు సంబందించి పరిశ్రమల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీహెచ్ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ల్యాండ్ అలాట్మెంట్, పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ డిజైన్స్ ఉండాలని సీఎం తెలిపారు. మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని.. ఇందులో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని.. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు. మిగతా2లో...



## నేడు తమిళనాడు కేబినేట్ విస్తరణ

**విజయ్ మంత్రివర్గంలోకి ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు**

**59 ఏళ్ల తరవాత తమిళనాట అధికారంలోకి కాంగ్రెస్**

**తొలి అక్షరం/చెన్నై,మే 20:** దాదాపు 59 సంవత్సరాల సుదీర్ఘ విరామం తరువాత కాంగ్రెస్ పార్టీ తమిళనాడు మంత్రివర్గంలోకి అడుగుపెడుతోంది. ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం గురువారం నాడు మంత్రివర్గ విస్తరణ సిద్ధమవుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజేష్ కుమార్, పి.విశ్వనాథన్ లు క్యాబినెట్ మంత్రులుగా మిగతా2లో...

## నేటినుంచి సరస్వతీ అంత్యపుష్కరాలు

● భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్న సిఎం రేవంత్ ● తొలి పుష్కర స్నానం చేయనున్న విజయేంద్ర సరస్వతి ● హాజరు కానున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా ● విస్తృతంగా ఏర్పాటు చేసిన అధికార యంత్రాంగం


2లో

## గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి

● బొగ్గు గ్యాసిఫికేషన్ దిశగా సింగరేణి ముందడుగు ● కేంద్ర సహకారం కోరిన డిప్యూటీ సీఎం భట్టి ● కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో భేటీ



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మే 20:** బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు వనరులకు అదనపు విలువ కల్పించడంతో పాటు, ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం, విధానపరమైన సహకారం, కేంద్ర పథకాల అనుసంధానంలో బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారం అందించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆయన కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఉపముఖ్యమంత్రి మిగతా2లో...

## గంగమాంబ జాతరలో పాల్గొన్న చంద్రబాబు

**అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన దంపతులు**


2లో


2లో

## ఆసిఫాబాద్ గడ్డపై 'ఇందిరమ్మ పండుగ'

- జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

## డ్రగ్స్ బాధితులకు డీ అడిక్షన్ సెంటర్లు

● సైబర్ క్రైమ్ నియంత్రణపై సమగ్ర నివేదిక ● ఫోరెన్సిక్, డేటా సెంటర్లను పెంచాలి ● ప్రభుత్వాదాయంపై గండికొట్టే వారిపై విజిలెన్స్ ● పోలీస్ ఉన్నతాధికారులతో భేటీలో సిఎం రేవంత్



**తొలి అక్షరం/హైదరాబాద్,మే 20:** డ్రగ్స్ బాధితుల కోసం ప్రత్యేక డి అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ ఆర్‌డి బోధి పెవిలియన్ లో పోలీస్ సీనియర్ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర భద్రతా సలహాదారు శివధర్ రెడ్డి,డీజీపీ సీవీ ఆనంద్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి ,అదనపు డీజీ లు,పోలీస్ కమిషనర్ లు,ఐజీ లు.సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిం మాట్లాడుతూ...డిపోర్టమెంట్ లో ఎస్ ఐ నుంచి నాన్ క్యాడర్ ఐపీఎస్ వరకు ప్రమోషన్ తరవాత 2 ఏళ్ల పాటు ఇతర విభాగాల్లో పని చేయాలన్నారు. దీనిపైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,డీజీపీ అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలన్నారు. సైబర్ క్రైమ్ నియంత్రణ పైన అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అన్నారు.

మిగతా2లో...

## విద్యారంగంలో పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు

● సాస్కీ పథకం కింద రూ.5వేల కోట్ల ప్రత్యేక సాయం ● నిర్మలా సీతారామన్‌ను కోరిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మే 20:** విద్యారంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు అదనపు ఆర్థిక సాయం అందించాలరి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న భట్టి బుధవారం నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. సాస్కీ పథకం కింద రూ.5వేల కోట్ల ప్రత్యేక సాయం, విద్యారంగంలో పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు ఇవ్వాలని కేంద్రమంత్రిని భట్టి విక్రమార్క కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో

మిగతా2లో...

# నేడు తమిళనాడు కేబినేట్ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలియజేశారు. 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదంతో పార్టీ ఎమ్మెల్యేలు అడ్వకేట్ రాజేష్ కుమార్, పి.విశ్వనాథ్‌లు విజయ్ సారథ్యంలోని తమిళ నాడు క్యాబినెట్‌లో మంత్రులుగా గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇది మాకు ఒక చారిత్రక సందర్భం. 59 ఏళ్ల సుదీర్ఘ విరామం తరువాత కాంగ్రెస్ పార్టీ తమిళనాడు క్యాబినెట్‌లో చేరుతోంది. ప్రభుత్వంలో చేరుతున్న మా ఎమ్మెల్యేలు ఇద్దరికీ అభినందనలు. తమిళనాడు ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చి, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ నిర్దేశించిన సంక్షేమ, ప్రజానుకూల ప్రభుత్వ విజన్‌ను సాకారం చేస్తారని ఆశిస్తున్నాం' అని ఆ పోస్టులో కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా ద్రవిడ పార్టీలకు జూనియర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. సుదీర్ఘ కాలంగా డీఎంకేతో పొత్తు సాగించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం కాకుండా పరోక్షంగా మద్దతు కొనసాగిస్తూ వచ్చింది. ఇటీవల ఎన్నికల అనంతర రాజకీయ పరిణామాల నేపథ్యంలో డీఎంకే పార్టీతో పొత్తుకు ఉద్వాసన చెప్పి విజయ్ టీవీకే ప్రభుత్వం ఏర్పాటు కోసం ఆ పార్టీతో జతకట్టింది.తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు గాను టీవీకే 118 స్థానాల్లో గెలిచి ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు 10 సీట్లు తగ్గడంతో పొత్తులకు తెరతీసింది. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్, వీసీకేలు విజయ్‌కు మద్దతు ప్రకటించడంతో విజయ్ ముఖ్యమంత్రిగా మే 10న ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు మరో తొమ్మిది మంది క్యాబినెట్‌లో చేరారు.

# గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి

(మొదటి పేజీ తరువాయి)

భట్టి విక్రమార్క బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో సమావేశమయ్యారు . ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్?ఎఎ మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బొగ్గును కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికే పరిమితం చేయకుండా, భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారితంగా వినియోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశవ్యాప్తంగా బొగ్గు గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, సింగరేణి కూడా ఆ దిశగా ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. కోల్ ఇండియా చేపడుతున్న గ్యాసిఫికేషన్ కార్యక్రమాల తరహాలోనే, సింగరేణి కూడా తన బొగ్గు వనరులను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సింగరేణి దక్షిణ భారతదేశ బొగ్గు సరఫరా, విద్యుత్ రంగ అవసరాల తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థ అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సింగరేణికి కొత్త బొగ్గు వనరుల సమీకరణ అత్యవసరమని తెలిపారు. గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ పరిధిలోని కొయ్యగూడెం బ్లాక్?ఎఎ తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీలకమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఈ బ్లాక్ వేలంలో కేటాయించబడినప్పటికీ నాలుగేళ్లు గడిచినా కార్యకలాపాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొయ్యగూడెం బ్లాక్ ఎఎను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాడిచెర్ల కోల్ బ్లాక్ ఎఎ అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ బ్లాక్‌కు సంబంధించి సింగరేణి ఇప్పటికే ప్రీ-మైనింగ్ కార్యకలాపాలు, అన్వేషణ పనులు చేపట్టిందని, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. తాడిచెర్ల కోల్ బ్లాక్?ఎఎ అభివృద్ధి సింగరేణి భవిష్యత్ అవసరాలకు, తెలంగాణ విద్యుత్ భద్రతకు కీలకమని చెప్పారు. తాడిచెర్ల కోల్ బ్లాక్?ఎఎకు ఓఆఖీ చట్టం, 1957లోని సెక్షన్ 5 కింద ముందస్తు అనుమతి మంజూరు చేసి, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు. అంశాలపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సింగరేణి బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రణాళికలు, కొయ్యగూడెం బ్లాక్ ఎఎఎ కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్ ఎఎ మైనింగ్ లీజ్ అంశాలపై సంబంధిత కేంద్ర, రాష్ట్ర అధికారులు, సింగరేణి ప్రతినిధులతో త్వరలో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి డా. గౌరవ్ ఉప్పల్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ డా. జ్యోతి బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ గౌతమ్ పొట్రు, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ శ్రీ కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని సీఎం అన్నారు.ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించాలని సీఎం తెలిపారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రధాని మోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చూడాలన్నారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయా లని ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్ సైట్ రూపొందించాలని వెల్లడించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రూప్ 1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూసేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని.. డేటా సిటీ నీటి అవసరాల కోసం ఎస్‌టీపీలను వినియోగించాలని సూచనలు చేశారు. జీసీసీలు, డేటా సెంటర్లు కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించాలని ఆదేశించారు. ద్వితీయ శ్రేణి నగరాల్లో జీసీసీ ఏర్పాటు పైనా దృష్టి పెట్టేలా పాలసీ రూపకల్పన చేయాలన్నారు. మూడు నెల్లో ప్రభుత్వ కార్యాలయాలు.. టీ-ఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందే అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# విద్యారంగంలో పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమన్నారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. 2014-2023 మధ్య ప్రత్యేక ప్రయోజన సంస్థల (ఎస్‌పీవీ) ద్వారా తీసుకున్న అప్పుల భారం, వాటి చెల్లింపుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందంటూ కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.

విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని నిర్మలా సీతారామన్ దృష్టికి భట్టి విక్రమార్క తీసుకెళ్లారు. 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి మొత్తం రూ.30,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళిక రూపొందించిందని, దీనిలో రూ.21,000 కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ క్యాంపస్‌ల నిర్మాణం, మరో రూ.9,000 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థలు, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు.

# నేటినుంచి సరస్వతీ అంత్యపుష్కరాలు

తొలి అక్షరం/హైదరాబాద్,మే 20: సరస్వతీ అంత్య పుష్కరాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మే 21వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని తెలిపారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చేయాలని చెప్పారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున భక్తుల ఆరోగ్యం కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పుష్కరాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా జరగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ పుష్కర శుభాకాంక్షలు తెలిపారు. మే 21వ తేదీ ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభంకానున్నాయి. తొలి పుష్కర స్నానం కంచి స్వామి విజయేంద్ర సరస్వతీ చేయనుండగా, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం కానుంది. 12 రోజుల పాటు కొనసాగే ఈ పుష్కరాలకు సుమారు 30 నుంచి 40 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.30.63 కోట్లతో భారీ ఏర్పాట్లు చేపట్టింది. పుష్కర ప్రాంతంలో భద్రత కోసం 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 100 మంది గజ ఈతగాళ్లను నియమించడంతో పాటు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, సేఫ్టీ బోట్లను మోహరించారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రత్యేక హారతి, తెప్పోత్సవాలకు కూడా భారీ ఏర్పాట్లు చేశారు. అదనంగా రూ.1.20 కోట్లతో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయగా, నాగేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేశారు. మీడియా సెంటర్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గత సంవత్సరం జరిగిన సరస్వతీ ఆది పుష్కరాల సందర్భంగా జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంత్య పుష్కరాలకు వివిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పుష్కర ఘాట్ వద్ద కయిర్ మ్యాట్లు, చలువ పందిళ్లు, ఓ. ఆర్.ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ పరిసరాల్లోని 23 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్, బీ.టి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పుష్కరాల పనుల కోసం ప్రభుత్వం రూ. 30.63 కోట్ల నిధులను కేటాయించింది. కంచి స్వామి విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా లచే తొలి పుష్కర స్నానం చేస్తారు. పుష్కరాల తొలిరోజైన 21 వ తేదీ తెల్లవారు జామున 5.43 గంటలకు కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా లు పుష్కర స్నానం చేసి అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. 21 వ తేదీ నుండి జూన్ 1 వతేదీ వరకు ప్రతీ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజీ ఈ పుష్కరాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారు. ప్రతీరోజూ ఉదయం హోమాల నిర్వహణ, సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 90 షటిల్ బస్సులను ఏర్పాటు చేశారు. రెస్క్యూ బృందాలతోపాటు ప్రత్యేక శిక్షణ పొందిన 100 మంది గజ ఈతగాళ్లను సరస్వతీ ఘాట్, నదీ ప్రాంతంలో నియమించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.20కోట్లుతో ప్రత్యేకంగా మ్యూజియాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నాగేంద్ర స్వామి ఆలయాన్ని 30 లక్షలతో పునర్నిర్మాణం చేశారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ నిర్వహించే హారతి, హోమాలు, తెప్పోత్సవం లకు పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేపట్టారు. పుష్కరాలకు హాజరయ్యే వారి సౌకర్యార్థం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించారు. దాదాపు 500 టాయిలెట్లు ప్రత్యేకగా ఏర్పాటు చేయడంతోపాటు తాగునీటి కోసం రెండు ఓ.హెచ్.ఆర్.సి లను నిర్మించారు. వాహనాల కోసం ఏర్పాటు చేసిన 23 పార్కింగ్ కేంద్రాలలోనూ తాగునీటి సౌకర్యంతో పాటు టాయిలెట్లను కూడా ఏర్పాటు చేశారు. కాళేశ్వరం పుష్కర ఘాట్ లోని 23 జోన్లలో ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు.

# ప్రభుత్వ రాయితీ పొందిన ఆస్పత్రులకు హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు ఢిల్లీ ప్రభుత్వానికి ప్రామాణిక కార్యాచరణ విధానం రూపొందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇవా రోగులకు ఉచిత చికిత్స అమలు విషయంలో కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ 51 ఆస్పత్రుల్లో కేవలం నాలుగు ఆస్పత్రులే నిబంధనలు పాటిస్తున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రైవేట్ ఆస్పత్రులు తమ ఇన్‌పేషెంట్ విభాగంలో 10 శాతం, అవుట్‌పేషెంట్ విభాగంలో (ఓపీ) 25 శాతం వరకు ఉచిత చికిత్స అందించడం తప్పనిసరని మరోసారి స్పష్టం చేసింది. 2018లో ఇచ్చిన తీర్పును సమర్థవంతంగా అమలు చేయడానికి స్పష్టమైన ఎస్‌ఓపీ రూపొందించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. న్యాయస్థానం తీర్పును ఉల్లంఘించినట్లు తేలిన 51 ఆస్పత్రుల్లో మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వెంకటేశ్వర, మూల్ చంద్ హాస్పిటల్స్ ఉన్నాయి. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లు తేలిన ఆస్పత్రులపై గతంలో ధిక్కరణ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడైంది. ఈ అంశంపై ఢిల్లీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మే 23వ తేదీన ఢిల్లీ సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. 'యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ మూల్‌చంద్ ఖైరతీ రామ్ ట్రస్ట్' కేసులో జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.

# ఇటలీలో పీఎం మోడీ

(మొదటి పేజీ తరువాయి)

ఆ వీడియోకు "బహుమతికి ధన్యవాదాలు" అని ఆమె క్యాప్షన్ పెట్టారు.అదే విధంగా ప్రధానమంత్రి మోదీ బుధవారం (స్థానిక కాలమానం ప్రకారం) ఇటలీ అధ్యక్షుడు సెర్గియో మట్టారెల్లాతో ప్రతినిధి బృంద స్థాయి చర్చలు జరిపారు.

ఈ ద్వైపాక్షిక సమావేశంలో పీఎం మోదీ వెంట విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్, విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి (పశ్చిమ) సిబి జార్జ్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ, ఇతర సీనియర్ దౌత్య అధికారులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని తెలుస్తోంది. అయితే, చైనా అధికారికంగా ఇంకా ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. జిన్‌పింగ్ భారత పర్యటనపై ఇప్పటికే అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది.2019లో జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించారు. ఆ తరువాత 2020లో గాల్వాన్ లోయలో ఇరు దేశాల మధ్య తలెత్తిన ఘర్షణలు, 2022లో తవాంగ్ బోర్డర్ వద్ద ఉద్రిక్తతల కారణంగా కొంతకాలం పాటు పరిస్థితులు గంభీరంగా మారాయి. ఆ తరువాత రష్యాలో కజాన్ వేదికగా జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మోదీ, జిన్‌పింగ్‌లు సమావేశమయ్యారు. భౌగోళిక రాజకీయాలు, ఇరాన్ యుద్ధం విషయంలో బ్రిక్స్ కూటమిలో భేదాభిప్రాయాలు నెలకొన్నాయన్న వార్తల నడుమ తాజా సమావేశాలకు రష్యా, చైనా అధినేతలు హాజరుకానున్నారు. ఇటీవల జరిగిన బ్రిక్స్ విదేశాంగ శాఖ మంత్రులు, ప్రతినిధుల సమావేశంలో భేదాభిప్రాయాల కారణంగా దేశాల సంయుక్త ప్రకటన ఏదీ వెలువడలేదు.

# గంగమాంబ జాతరలో పాల్గొన్న చంద్రబాబు

తొలి అక్షరం/చిత్తూరు,మే 20: చిత్తూరు జిల్లా కుప్పం శ్రీప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కుప్పం పర్యటనలో భాగంగా ఉండవల్లి నుంచి హెలికాప్టర్ ద్వారా తుమ్మిసి హెలిప్యాడ్‌కు వచ్చిన సీఎం.. స్వగృహానికి చేరుకున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో శ్రీప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయానికి చేరుకున్న సీఎంకు.. అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. జాతర సందర్భంగా అమ్మవారికి కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలను సమర్పించి.. ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

# జగిత్యాల జిల్లాలో తీవ్ర విషాదం.. కోనేరులో పడి ముగ్గురు బాలల మృతి

తొలి అక్షరం/జగిత్యాల,మే 20: జగిత్యాల జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మేడిపల్లి మండలం కొండాపూర్‌లో ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తూ మృతిచెందారు. శివగంగా ఆలయ కోనేరులో పడి ప్రాణాలు కోల్పోయారు. మృతిచెందిన చిన్నారులను మన్విత్ (11), మనస్వి (9), షార్విండ్ (7)గా గుర్తించారు. ఈరోజు (బుధవారం) మధ్యాహ్న సమయంలో సరదాగా ఆడుకునేందుకు ఆలయం వద్దకు వెళ్లిన చిన్నారులు.. అనంతరం ఈత కొట్టేందుకు కోనేరులో దిగారు. అయితే ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయారు. కాపాడాలంటూ కేకలు వేశారు. కొద్దిసేపటి తర్వాత ప్రమాదాన్ని గమనించిన స్థానికులు కోనేరులో నుంచి వారిని బయటకు తీశారు. ముగ్గురినీ హుటాహుటిన జగిత్యాల ప్రభుత్వ క్రిటికల్ కేర్ ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. భారతి-భూషణం దంపతుల పిల్లలు మన్విత్, మనస్వి కాగా.. భార్గవి-శేఖర్ కుమారుడు షార్విండ్. చిన్నారుల మృతితో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. మరోవైపు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఆసిఫాబాద్ గడ్డపై 'ఇందిరమ్మ పండుగ'

తొలి అక్షరం/కొమరం భీమ్ ఆసిఫాబాద్,మే 20: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న పేదల సొంతింటి కలలను నిజం చేసే ప్రతిష్ఠాత్మక 'ఇందిరమ్మ ఇండ్ల' రెండో విడత కార్యక్రమానికి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వేదిక కానుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లాలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం రాష్ట్ర ఆబ్కారీ, మధ్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె. హరిత, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తదితరులతో కలిసి మంత్రి సభాస్థలి, రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్, కాగజ్‌నగర్ మండలం దారాపూర్, సిర్పూర్ పేపర్ మిల్ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి సందర్శించనున్న ప్రాంతాలతో పాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కూడా సమీక్షించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# డ్రగ్స్ బాధితులకు డీ అడిక్షన్ సెంటర్లు

(మొదటి పేజీ తరువాయి)

ఫోరెన్సిక్ సెంటర్స్,డేటా సెంటర్లని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.పోలీస్ ట్రైనింగ్ లోనే సైబర్ క్రైమ్ విభాగం లో పని చేయడం కోసం సెలక్షన్ జరగాలని సూచించారు. అన్ని విభాగాలు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయం బాగా పెరగాలన్నారు. స్కిల్స్ యూనివర్సిటీ లో సైబర్ క్రైమ్ పైన పోలీస్ విభాగం కోసం ప్రత్యేక కోర్స్ ఏర్పాటు చేయాలన్నారు. విజిలెన్స్ విభాగంలో సాంకేతికతను పెంచాలి. ప్రభుత్వ అవకతవకలని గండి కొట్టే వారి పైన విజిలెన్స్ దృష్టి పెట్టాలి.. డేటా అనాలసిస్ ఆధారంగా ఆర్గనైజ్ క్రైమ్ పైన విజిలెన్స్ దృష్టి సారించాలి. విజిలెన్స్ కు మరిన్ని అధికారాలు ఇచ్చే అంశం పైన అధ్యయనం చేయాలని అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత కాకుండా అగ్ని ప్రమాదాలు జరగకుండా డిపార్టుమెంట్ చర్యలు తీసుకోవాలి.మునిసిపల్ డిపార్ట్మెంట్ ,హైడ్రాతో సమన్వయం చేసుకొని డిపార్టుమెంట్ పైన జూన్ 15 లోగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలన్నారు.

# ఆన్‌లైన్‌లో ఔషధ విక్రయాలను నిలిపివేయాలి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మే 20:** ఆన్ లైన్ ఔషధ విక్రయాలను వెంటనే నిలిపివేయాలని కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎం గోపాల్ డిమాండ్ చేశారు.ఈ మేరకు బుధవారం తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని మెడికల్ షాపులను మూసివేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ....కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆన్లైన్ ఫార్మసీ విధానం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న మెడికల్ షాపుల నిర్వాహకులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అమ్మకాల్లో ఎక్కువ శాతం డిస్కౌంట్ ఇవ్వడం, ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులను సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు.ఆన్‌లైన్ ఔషధాల విక్రయాలతో రిటైల్ మందుల షాపుల్లో విక్రయాలు తగ్గి మందుల దుకాణాలు కుదేలవుతున్నాయన్నారు. అలాగే డీలర్ల పరిస్థితి కూడా ఇదే పరిస్థితి ఉందని, ఆన్లైన్ ద్వారా నిషేధిత పరిమితికి మించిన ఔషధాలు కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. ఒకే ప్రిస్క్రిప్షన్‌ను పలుమార్లు రిపీట్ చేస్తూ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే మందులను మోతాదుకు మించి కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని ఆరోపించారు.ఆన్ లైన్ మందుల విక్రయాలపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి దామెర సరేష్, కోశాధికారి ముదుపు రవీందర్ రెడ్డి, ఫార్మసీల నిర్వాహకులు పాల్గొన్నారు.

## సూదనపు ఉపేందర్ పార్థివదేహానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి

- నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి





**తొలి అక్షరం/నెక్కొండ మే 20:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణ వాస్తవ్యులు సూదనపు ఉపేందర్ అనారోగ్యం తో మరణించగా వారి పార్థివదేహానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించి వారి అంతిమ యాత్రలో పాల్గొన్న నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి,నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మండల అధ్యక్షులు లౌడియా తిరుమల్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మాదటి శ్రీనివాస్, ఆవుల శ్రీనివాస్, చల్లా శ్రీపాల్ రెడ్డి,నర్సంపేట కోర్టు ఏజీపీ అడ్వకేట్ బండి శివకుమార్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి,బొమ్మెర బోయిన రమేష్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్,చల్లా పాపిరెడ్డి,సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి,బూర్గు నరేష్, బైరు రాజాలు,బైరు వెంకన్న, పెద్దకాసు మల్లయ్య,వార్డ్ సభ్యులు దేవానబోయిన విజేందర్,గంధం రాజు,గరికపాటి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్‌లో కెమిస్ట్ బంద్ ఫెయిల్..! ప్రజాసేవలో నిలిచిన ఫార్మసిస్టులు

**జిల్లా వ్యాప్తంగా యథావిధిగా కొనసాగిన మెడికల్ షాపులు.. బంద్‌కు లభించని స్పందన!**

**ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సేవలు నిలిపివేయని అర్హత కలిగిన ఫార్మసిస్టులు!**

**లైసెన్స్ రెంటింగ్ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలి : తన్నీరు వేణు**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ మే 20:** మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఇచ్చిన బంద్ పిలుపు పూర్తిగా విఫలమైందని ఫార్మసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు వేణు తెలిపారు. జిల్లాలో అధిక శాతం మెడికల్ షాపులు యథావిధిగా తెరుచుకుని ప్రజలకు నిరంతరాయంగా సేవలు అందించాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఫార్మసిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరించారని కొనియాడారు.కొంతమంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం బంద్‌కు పిలుపునిచ్చినా.. అర్హత కలిగిన ఫార్మసిస్టులు మాత్రం ప్రజా ఆరోగ్యాన్ని ముఖ్యంగా భావించి సేవలను కొనసాగించారని వేణు స్పష్టం చేశారు. అత్యవసర మందుల కోసం వచ్చే రోగులు, వృద్ధులు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెడికల్ షాపులు సాధారణ రోజుల మాదిరిగానే పనిచేశాయని తెలిపారు.ఈ సందర్భంగా తన్నీరు వేణు మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో పెరుగుతున్న అక్రమాలపై ఆందోళన వ్యక్తం చేశారు."ఫార్మసీ అనేది కేవలం వ్యాపారం కాదు.. ఇది ప్రజల ప్రాణాలకు సంబంధించిన ఆరోగ్య సేవ. ప్రస్తుతం కొందరు 'లైసెన్స్ రెంటింగ్' పేరుతో అక్రమాలకు పాల్పడుతూ ఫార్మసీ వ్యవస్థను దెబ్బతీస్తున్నారు. అర్హత కలిగిన ఫార్మసిస్టుల ద్వారానే మందుల పంపిణీ జరగాలి. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి" అని ఆయన డిమాండ్ చేశారు.అలాగే ప్రజల సేవను ధ్యేయంగా తీసుకుని బంద్‌కు సహకరించకుండా మెడికల్ సేవలను కొనసాగించిన ప్రతి ఫార్మసిస్టుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు ఫార్మసిస్టుల హక్కుల సాధన కోసం తమ సంఘం ముందుండి పోరాడుతుందని తన్నీరు వేణు స్పష్టం చేశారు.

# బాధితురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ఆర్థిక సాయం

**పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ఆదేశాలతో పరామర్శ**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మే 20:** ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాన్ని తొర్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి, ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ఆదేశానుసారం తొర్రూర్ మండలం మడిపల్లి గ్రామ పరిధిలోని పిల్లికుంట తండాకు చెందిన ధరావత్ జాంకి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మడిపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ జక్కా మహబూబ్ రెడ్డి, జక్కా ఇంద్రసేన రెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జాంకి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. అనంతరం తమ సొంత ఖర్చులతో బాధితురాలి కుటుంబానికి రూ. 3000 నగదు మరియు 25 కేజీల బియ్యాన్ని అందజేశారు.ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి సహకారంతో బాధిత కుటుంబానికి రాబోయే రోజుల్లో అన్ని విధాలుగా అండగా ఉంటాం.ఈ పరామర్శ కార్యక్రమంలో ముఖ్య నాయకులు: మడిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెన్నం సోమిరెడ్డి, మాజీ సర్పంచ్లు రావుల వెంకట్ రెడ్డి, గడిలా మాధవి సాయిలు.వార్డు సభ్యులు: రావుల శ్రీనివాస్ రెడ్డి, వల్లంల వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు మహంకాళి సంపత్, కొండేటి చరణ్, వేల్పుల వెంకన్న, శెట్టిపల్లి శ్రీను, ఎండి షేక్, వేల్పుల ఎంకులు, చల్ల మీనా రెడ్డి, యర్రం రాజు యాదవ్, దేవేందర్, నడిగడ్డ మధు.స్థానికులు & కార్యకర్తలు: డి. వెంకన్న, డి. రెడ్డి, డి. స్వరూప, డి. బద్రి, బి. వెంకన్న, బి. సోమల, బి. తుమ్మి, బి. పాప, డి. నరేష్, బి. పూరన్, డి. కుంతీ, బి. గణేష్, డి. గణేష్, డి. విగ్నేష్, డి. తరుణ్, బి. నరేష్, డి. బిచాని, డి. మంగుళ తదితరులు ఉన్నారు.

# పేదింటి చిరునవ్వే మా పాలనకు అసలైన గెలుపు!

- కన్నీళ్లు తుడిచిన 'కళ్యాణ లక్ష్మి'.. 60 కుటుంబాల్లో వెలిగిన పెళ్ళి వెలుగులు
- రూ.10.50 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయంతో 35 మందికి పునర్జన్మ.. అండగా నిలిచిన ప్రభుత్వం
- ఇందిరమ్మ ఇల్లు ప్రతి పేదవాడి హక్కు.. త్వరలోనే రెండో విడత పంపిణీ: ఎమ్మెల్యే రామచంద్ర నాయక్





**తొలి అక్షరం/నరసింహుల పేట మే20:** రాజకీయ పదవులు, అధికారాల కంటే పేదవాడి ముఖంలో చూసే చిరునవ్వే తాము చేసే పాలనకు అసలైన విజయమని డోర్నకల్ శాసనసభ్యులు రామచంద్ర నాయక్ అన్నారు. నరసింహులపేట మండల కేంద్రంలోని రైతు వేదిక వేదికగా బుధవారం జరిగిన ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీ కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా.. వందలాది కుటుంబాల ఆనంద వేదికగా మారింది. నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్న సమయంలో సభలో భావోద్వేగ వాతావరణం నెలకొంది.**ఆడబిడ్డల పెళ్ళిళ్లకు కొండంత అండ..**మండల పరిధిలోని 60 మంది లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న తల్లులు, ఆడబిడ్డల కళ్లలో ఆనంద బాష్పాలు రాలగా, రైతు వేదిక హర్షధ్వానాలతో మార్మోగింది.అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ, వైద్య ఖర్చుల భారంతో కుంగిపోతున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం కొండంత భరోసా ఇచ్చింది. మండలంలో వివిధ వ్యాధులతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న 35 మంది బాధితులకు సుమారు రూ. 10 లక్షల 50 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ మాట్లాడిన మాటలు సభలో ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేశాయి. ఆయన తన ప్రసంగంలో మాట్లాడుతూ..."ప్రజలు నాపై ఉంచిన నమ్మకం నాకు పదవి కంటే చాలా గొప్పది. పేదింట్లో అమ్మాయి పెళ్లి అనేది ఒక కుటుంబానికి ఎంత పెద్ద బాధ్యతో, ఆ తండ్రి పడే ఆరాటం ఎలాంటిదో ఒక బిడ్డగా నాకు బాగా తెలుసు. అలాంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వం ఒక మేనమామలా, ఇంటి పెద్దలా అండగా నిలవాలిడ అదే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అసలు ఉద్దేశ్యం. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న నిరుపేద కుటుంబాలు డబ్బుల కోసం ఆస్పత్రుల చుట్టూ, అప్పుల కోసం వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగకూడదు. రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం అందించి, సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం మీ ఇంటి పెద్దలా మీకు అండగా ఉంటుంది.ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం. ఇందిరమ్మ ఇల్లు కేవలం నాలుగు గోడలు కాదుడ అది ఒక కుటుంబ భవిష్యత్తుకు, వారి ఆత్మగౌరవానికి ఇచ్చే భరోసా. త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేపట్టి మరిన్ని అర్హుల కలలను నిజం చేస్తాం." అని భావోద్వేగంగా హామీ ఇచ్చారు.ప్రజా సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పార్టీ ముఖ్య నాయకులు, మహిళలు, యువకులు మరియు లబ్ధిదారులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ ప్రతి ఒక్క లబ్ధిదారుడిని ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకుంటూ సాగిన తీరు సభకు వచ్చిన వారిని ఎంతగానో ఆకట్టుకుంది. ప్రజా సమస్యలపై ఆయన చూపిన చొరవ, చేసిన ప్రసంగం ప్రస్తుతం నరసింహులపేట నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది.

# ఆరుబయట నిద్రిస్తున్న వారే టార్గెట్... చైన్ స్నాచర్ అరెస్ట్

- కట్టర్‌తో బంగారు చైన్ కట్ చేసి పరారీ
- నర్సింహులపేట పోలీసుల చాకచక్యంతో నిందితుడు అదుపులోకి
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ కృష్ణకిషోర్ సూచన




**తొలి అక్షరం/నరసింహారావు పేట మే 20:** మహబూబాబాద్ జిల్లాలో వరుస చైన్ స్నాచింగ్ ఘటనలకు పాల్పడుతున్న నిందితుడిని నర్సింహులపేట పోలీసులు చాకచక్యంగా పట్టుకొని అరెస్ట్ చేశారు. ఆరుబయట నిద్రిస్తున్న వారినే లక్ష్యంగా చేసుకుని బంగారు, వెండి ఆభరణాలను దొంగిలిస్తున్న గుగులోత్ రమేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ కే. కృష్ణకిషోర్ వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం... పాండ్య తండాకు చెందిన గుగులోత్ వీరన్న ఈ నెల 18వ తేదీన తన ఇంటి ముందు ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో నిందితుడు గుగులోత్ రమేష్ అక్కడికి చేరుకుని కట్టర్ సహాయంతో మెడలో ఉన్న బంగారు చైన్‌ను కట్ చేసి లాక్కెళ్లాడు. బాధితుడు ఒక్కసారిగా మేల్కొని పట్టుకునే ప్రయత్నం చేయగా, కాళ్ల వద్ద ఉన్న వెండి పట్టీలు మరియు కట్టర్ అక్కడే పడేసి నిందితుడు పరారయ్యాడు. దొంగిలించిన బంగారు చైన్ సుమారు 15 గ్రాముల బరువుతో రూ.1.50 లక్షల విలువ ఉంటుందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా నర్సింహులపేట ఎస్సై బానోత్ వెంకన్న ఆధ్వర్యంలో పోలీసులు వంటడపల్లి స్టేజ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న గుగులోత్ రమేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో పాండ్య తండాలో జరిగిన చైన్ స్నాచింగ్‌తో పాటు మరో చోట వెండి పట్టీ గొలుసులను కూడా లాక్కునేందుకు ప్రయత్నించినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ కే. కృష్ణకిషోర్ మాట్లాడుతూ... "ప్రజలు రాత్రి సమయంలో ఇంటి ముందు ఆరుబయట నిద్రించకూడదు. ముఖ్యంగా విలువైన బంగారు ఆభరణాలను ధరించి బయట నిద్రించడం ప్రమాదకరం. ఇటువంటి నేరస్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి" అని సూచించారు.అలాగే కేసును త్వరితగతిన ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన నర్సింహులపేట ఎస్సై బానోత్ వెంకన్నతో పాటు పోలీసు సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ఆరని చిచ్చు: నరసింహులపేటలో బూడిదైన రెండెకరాల పామాయిల్ తోట.. అన్నదాత ఆక్రందన!



**కళ్లముందే కాలిపోయిన కల్పవృక్షాలు..**

**కుప్పకూలిన రైతు కుటుంబం**

**ప్రాణాలకు తెగించి మంటల్లోకి దూకినా దక్కని పంట**

**కలవరపెడుతున్న అగ్నిప్రమాదం**

**లక్షల పెట్టుబడి బుగ్గిపాలు.. అప్పుల ఊబిలో అన్నదాత**

**ఉద్యానవన, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి ఆర్థిక సాయం అందించాలని డిమాండ్**

**తొలి అక్షరం/నరసింహుల పేట మే 20:** నరసింహులపేట మండల కేంద్రంఆకాశమంత ఆశతో, ఐదేళ్ల నిరంతర శ్రమతో పెంచిన పచ్చని తోట.. కళ్లముందే కాటిపాలైంది. చేతికొచ్చిన పంటతో అప్పులు తీరి, ఇల్లు గడుస్తుందనుకున్న తరుణంలో విధి ఆడిన వింత నాటకానికి ఒక సామాన్య రైతు నిలువునా మునిగిపోయాడు. నరసింహులపేట మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఘోర అగ్నిప్రమాదం స్థానిక రైతాంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎగసిపడిన అగ్నికీలలకు రెండు ఎకరాల పామాయిల్ తోట పూర్తిగా దహనమై, నిలువునా బూడిద కుప్పగా మారింది. **సంఘటన వివరాల్లోకి వెళితే..** నరసింహులపేట మండల కేంద్రానికి చెందిన తోట సురేష్ అనే రైతు తనకున్న భూమిలో ఎంతో నిష్టగా, లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పామాయిల్ తోటను సాగు చేస్తున్నాడు. కాగా, బుధవారం మధ్యాహ్నం సమయంలో తోటలో ఒక్కసారిగా ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. ఎండ తీవ్రతకు, ఎండుటాకులకు తోడు తోటలో మంటలు క్షణాల్లోనే ఉగ్రరూపం దాల్చి చుట్టుపక్కల చెట్లకు వ్యాపించాయి. ఈ ఘోర ప్రమాదం గురించి సమాచారం అందగానే గుండె పగిలినంత పనైన తోట యజమాని తోట సురేష్, తన మిత్రులు కదుదుల రామకృష్ణ, వెన్నం రవీందర్ రెడ్డిలతో కలిసి క్షణాల్లో తోట వద్దకు పరుగులు తీశారు. చుట్టుముడుతున్న దట్టమైన పొగను, వేడిని సైతం లెక్కచేయకుండా.. తమ ప్రాణాలను పణంగా పెట్టి మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. చుట్టుపక్కల ఉన్న నీటిని చల్లుతూ, మంటలు మరింత వ్యాపించకుండా అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నించారు. కానీ, అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. ఎగసిపడుతున్న అగ్ని కీలల ధాటికి సుమారు రెండు ఎకరాల మేర విస్తరించి ఉన్న పచ్చని పామాయిల్ చెట్లు నిలువునా కాలి బూడిదయ్యాయి. చేతికొచ్చిన పంట బొగ్గుగా మారడాన్ని చూసి, ఆ రైతు సురేష్ గుండెలవిసేలా ఏడవడం అక్కడ ఉన్నవారిని కంటతడి పెట్టించింది. **ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఆదుకోవాలి** ఈ నష్టం ఒక ఏడాది కష్టంతో పోయేది కాదు. పామాయిల్ తోట సాగు చేయాలంటే ఏళ్ల శ్రమ, వేలాది రూపాయల పెట్టుబడి అవసరం. అపారమైన నష్టంతో కుంగిపోయిన ఆ రైతును ఆదుకోవాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది. ఈ ఘోర ప్రమాదంపై ఉన్నతాధికారులు, పాలకులు తక్షణమే స్పందించాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ, ఉద్యానవన శాఖ అధికారులు వెనువెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి, నష్టాన్ని అంచనా వేయాలి. సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డ రైతు సురేష్‌కు ప్రభుత్వం తక్షణమే భారీ ఆర్థిక సహాయాన్ని అందించి, తిరిగి తోటను పునరుద్ధరించుకునేలా రాయితీలతో కూడిన సాయం అందించి ఆదుకోవాలని మండల ప్రజలు, తోటి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. **అప్పులు తెచ్చి ప్రాణంగా పెంచిన తోట బుగ్గిపాలైంది.. ప్రభుత్వం ఆదుకోకుంటే మాకు ఆత్మహత్యే శరణ్యం!" - నష్టపోయిన రైతు తోట సురేష్ ఆవేదన** "ఐదేళ్లుగా రక్తాన్ని చెమటగా మార్చి, అప్పులు తెచ్చి లక్షల రూపాయల పెట్టుబడితో ఈ పామాయిల్ తోటను కంటికి రెప్పలా పెంచుకున్నాను. చేతికొచ్చిన పంటను చూసుకుని అప్పులు తీరుతాయని ఆశపడేలోపే, అగ్నిప్రమాదం నా పచ్చని సంసారంలో కోలుకోలేని చిచ్చు పెట్టింది. నా మిత్రులు రామకృష్ణ, రవీందర్ రెడ్డిలతో కలిసి ప్రాణాలకు తెగించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా.. అగ్నిదేవుడు నా కష్టాన్ని నిలువునా మింగేశాడు. కళ్లముందే రెండెకరాల తోట పూర్తిగా కాలి బూడిదవుతుంటే నా గుండె ముక్కలైంది.. పెట్టుబడి అంతా పోయి ఇప్పుడు నా కుటుంబం రోడ్డున పడింది. ఈ ఘోర విపత్తుతో సర్వస్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న నన్ను అధికారులైనా, పాలకులైనా కనికరించి తక్షణమే స్పందించాలి. ప్రభుత్వం వెనువెంటనే మాకు భారీ ఆర్థిక సహాయం అందించి ఆదుకోకపోతే.. అప్పుల బాధతో మా కుటుంబానికి ఆత్మహత్యే శరణ్యం అవుతుంది."

# నాఖాబందీలో గంజా గుట్టు రట్టు నెల్లికుదురు పోలీసుల చాకచక్యంతో 2.395 కిలోల గంజా, కారు స్వాధీనం

**హైదరాబాద్‌కు తరలిస్తుండగా ముగ్గురు అరెస్ట్.. ఇద్దరు పరారీలో ఉన్నట్లు వెల్లడి**





**తొలి అక్షరం/నరసింహుల పేట మే 20:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు పోలీసుల నాఖాబందీలో భారీగా గంజా పట్టుబడిన ఘటన కలకలం రేపింది. జిల్లా వ్యాప్తంగా ఎస్పీ డా. శబరీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక నాఖాబందీ సందర్భంగా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి 2 కిలోల 395 గ్రాముల ఎండు గంజాతో పాటు ఒక మారుతి స్విఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌లో Cr. No.116/2026 కింద ఎన్డీపీఎస్ చట్టం సెక్షన్ 8(C) R/w 20(b)(ii)(B) ప్రకారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారండ అరెస్ట్ అయిన నిందితులు ఏదుల రాజ్ కుమార్ గౌడ్ (27), మాలేగోని ఆంజనేయులు (29), రామ్ గోని రాజేష్ (28)లు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటూ కార్ డ్రైవింగ్, కార్ వాషింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి గంజాయి సేవించే అలవాటు ఉండటంతో పాటు, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని దురుద్దేశంతో గంజా వ్యాపారంలోకి దిగినట్లు విచారణలో వెల్లడైంది. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ నుండి TG`09`T-4658 నంబరు గల మారుతి స్విఫ్ట్ డిజైర్ కారులో బయలుదేరిన నిందితులు భద్రాచలం చేరుకుని అక్కడ రాజేష్ అనే వ్యక్తి వద్ద సుమారు 2.4 కిలోల ఎండు గంజాను తక్కువ ధరకు కొనుగోలు చేశారు. ఆ గంజాలో కొంత తమ వినియోగానికి ఉంచుకుని, మిగిలిన గంజాను హైదరాబాద్‌లో అధిక ధరకు విక్రయించి డబ్బులు సంపాదించాలని యత్నించినట్లు పోలీసులు తెలిపారు. సూర్యాపేట మార్గంలో పోలీసుల తనిఖీలు ఎక్కువగా ఉంటాయని భావించిన నిందితులు మహబూబాబాద్ మార్గం ద్వారా హైదరాబాద్‌కు తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మే 19 రాత్రి 9:45 గంటల సమయంలో నెల్లికుదురు పరిధిలోని ఎం.కె.ఆర్ గార్డెన్స్ వద్ద నాఖాబందీ నిర్వహిస్తున్న ఎస్ఐ సీహెచ్. రమేష్ బాబు మరియు పోలీసు సిబ్బంది అనుమానాస్పదంగా వెళ్తున్న కారును తనిఖీ చేయగా గంజా బయటపడింది. పోలీసులు కారుతో పాటు 2 కిలోల 395 గ్రాముల గంజాను స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. పట్టుబడిన గంజా విలువ సుమారు రూ. 1,19,750గా అంచనా వేశారు. అనంతరం కేసముద్రం సీఐ వై. సత్యనారాయణ కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా పరారీలో ఉన్న రాజ్ ఏ ఖీ (మహబూబ్ నగర్), రాజేష్ (భద్రాచలం)లను త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు. ఈ గంజా పట్టివేతలో ప్రతిభ కనబరిచిన కేసముద్రం సీఐ వై. సత్యనారాయణ, నెల్లికుదురు ఎస్ఐ సీహెచ్. రమేష్ బాబు మరియు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డా. శబరీష్, డీఎస్పీ ఎన్. తిరుపతి రావు ప్రత్యేకంగా అభినందించారు.

# చిన్నారి అన్వికను ఆశీర్వదించిన నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లావుడ్య తిరుమల్ చౌహాన్





**తొలి అక్షరం/నెక్కొండ మే 20:** వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు వాస్తవ్యులు బొమ్మెర బోయిన ప్రేమకృష్ణ -అనూషల కూతురు అన్విక మొదటి పుట్టినరోజు వేడుకలకు హాజరై చిన్నారి అన్వికను ఆశీర్వదించిన నర్సంపేట మున్సిపాలిటీ చైర్మన్ పెండెం లక్ష్మి రామానంద్, నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లావుడ్య తిరుమల్ చౌహాన్, నెక్కొండ మండల కార్యనిర్వక అధ్యక్షులు ఆవుల శ్రీనివాస్, నెక్కొండ పి ఎస్ సి ఎస్ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, నర్సంపేట కౌన్సిలర్ శ్రీరామోజు రోజా రాణి, పొన్నాల మనిషా, వేల్పుల శ్రీలత, ఎలకట్టి విజయ్ కుమార్ బాణాల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# సహస్ర నూతన వస్త్రాలంకరణ వేడుక

**● నెల్లికుదురులో ఆనందోత్సాహాల మధ్య చిన్నారిని ఆశీర్వదించిన ప్రముఖులు ● ఎంఎకేఆర్ గార్డెన్‌లో కుటుంబ సభ్యులు, రాజకీయ నాయకుల సమక్షంలో వైభవంగా కార్యక్రమం**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ మే 20:** నెల్లికుదురు మండల కేంద్రంలోని ఎంఎకేఆర్ గార్డెన్‌లో ప్రముఖ వ్యాపారవేత్త కొమురవెల్లి కృష్ణమూర్తి కుమారుడు సంతోష్, గాయత్రి దంపతుల కుమార్తె సహస్ర నూతన వస్త్రాలంకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో చిన్నారి సహస్రకు ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు హెచ్ వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి సభ్యులు బీరవెల్లి యాదగిరి రెడ్డి, వెన్నం సుధాకర్ రెడ్డి, బొంబాయి, తాడూరి రమేష్, పాము వెంకన్న, ఓబీసీ మండల అధ్యక్షుడు ఆకుల నరసయ్య, సట్ల యాకయ్య తదితరులు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.

# మీ అధ్యక్షతలో కాంగ్రెస్‌కు కొత్త కళ రావాలి..

**- మున్సిపాలిటీ,మండల అధ్యక్షులను సత్కరించిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్..**



**తొలి అక్షరం/షాద్ నగర్, మే 20:** షాద్ నగర్ నియోజకవర్గ మున్సిపాలిటీ, మండల అధ్యక్షులుగా ఎన్నికైన నాయకులను మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ ఘనంగా సన్మానించారు. కొత్త అధ్యక్షులతో షాద్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎంత ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. షాద్నగర్ మున్సిపాలిటీ మండల అధ్యక్షుడు నలమోని శ్రీధర్, కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్ సుదర్శన్ గౌడ్, ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, కొందుర్గు మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, చౌదరిగుడా మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, కొత్తూరు మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, నందిగామ మండల అధ్యక్షుడు కుమారస్వామి, కేశంపేట మండల అధ్యక్షుడు రమేష్ లను ఆయన సత్కరించారు. అధ్యక్షులుగా ఎన్నికైన వారందరికీ అభినందనలు తెలిపారు.


# ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ కలయిక

**● పలువురు ప్రజాప్రతినిధులు,పార్టీ నేతలతో కలిసి భోజన సమావేశం**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,ప్రజాప్రతినిధులు బాలసముద్రంలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆత్మీయ వాతావరణంలో సమావేశమై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు కలిసి భోజనం చేశారు. ఈ ఆత్మీయ సమావేశంలో మంత్రి కొండా సురేఖ,ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి,రేవూరి ప్రకాష్ రెడ్డి,గండ్ర సత్యనారాయణ రావు,కేఆర్ నాగరాజు,ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య,రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ రాజేశ్వర్ రావు,డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,అయూబ్,కరుణాకర్,ధనవంతి,టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి,దుద్దిళ్ల శ్రీనుబాబు,రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ పాల్గొన్నారు.

# ఎస్ఐని సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు



**తొలి అక్షరం/నర్సింహులపేట మే 20:** ఇటీవల కాలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ వెంకన్నను నర్సింహులపేట బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల యూత్ అధ్యక్షుడు బండి రమేష్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పూల బొకేను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకన్న మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని యువత మద్యం,గంజాయికి బానిస కాకూడదని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొండబత్తిని జగదీశ్వర్,మాజీ వార్డు మెంబర్ మదార్,కుదుర్ల నాగరాజు తదితరులు ఉన్నారు.

# ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించి,సమస్యలు పరిష్కరించాలి

**● టియు జెఎసి చైర్మన్ సుల్తాన్ యాదగిరి,వైస్ చైర్మన్ తమ్మల శోభారాణి**





**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** మ్యానిఫెస్టోలో కేటాయించిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాలను వెంటనే కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ చైర్మన్ తమ్మల శోభారాణి అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ఉద్యమకారులను సముచిత స్థానం కల్పించి గౌరవించాలన్నారు. ఉద్యమ కారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వేసిన కె.కె కమిటిని పాక్షికంగా ఆమోదిస్తున్నామని,ఇంకా ఈ కమిటీ లో ఉద్యమ సంఘాల ప్రతినిదులను,మహిళను, విద్యార్థి నాయకుల్ని ఇంకా 5 గురిని కమిటీలో చేర్చాలన్నారు. ఉద్యమ కారులను విభజించవలదని అందరికి 250 గజాల ఇంటి స్థలం,25 వేల గౌరవ పెన్షన్,100 ఎకరాల్లో అమరుల స్మృతి వనం,గుర్తింపు కార్డు,వ్యాపార నిమిత్తం 50% సబ్సిడిలో కోటి రూపాయలు రుణం,25 లక్షల సామాన్య ప్రమాద భీమా,ఉచిత బస్ పాస్,భార్యా భర్తలకు ఇద్దరికీ కార్పొరేట్ వైద్యం ఉండాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్య అతిదిగా హాజరైన టియు జెఎసి చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వం కొందరికే ఫలాలు అందించి చేతులు దులుపుకుందామనే ఆలోచనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మనుగడ సాగించాలన్నా,వచ్చే అన్ని ఎన్నికలలో గెలవాలన్న,ఉద్యమకారుల సమస్యలు భేషరతుగా పరిష్కరించాలని,ఉద్యమ సంఘాల ప్రతినిధులను, ఉద్యమ కమిటీ అయిన కె.కె కమిటీలో చేర్చాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీయుజెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల యాదగిరి,రాష్ట్ర నాయకులు కె.సత్య,బి.ప్రమదా దేవి,బగ్గుల రమ,కొడేపాక అన్నపూర్ణ,నరేడ్ల విజయ,మాడిశెట్టి అరుంధతి,మారమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వాసవి రైస్ మిల్లును పరిశీలించిన ఎంపీడీవో



**తొలి అక్షరం/వలిగొండ మే 19:** మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ జలంధర్ రెడ్డి గారు వాసవి రైస్ మిల్లును సందర్శించి పరిశీలించారు. రైస్ మిల్లుకు ఎన్ని లారీలు వచ్చాయో, వాటిలో మొత్తం ఎన్ని లారీలు అన్‌లోడ్ చేశారో వివరాలు తెలుసుకున్నారు. లారీలు ఆలస్యం కాకుండా వెంటనే అన్‌లోడ్ చేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే అధికారులకు తెలియజేయాలని, అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జనాభా గణన కార్యక్రమాన్ని నిర్వర్తించిన ఎంపీడీవో



**తొలి అక్షరం :వలిగొండ, మే 20:** జీ. జలంధర్ రెడ్డి జనాభా లెక్కల కార్యక్రమంలో భాగంగా నాథాల్లగూడెం గ్రామంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి తో కలిసి గ్రామంలోని ప్రజలను కలుసుకుని జనాభా లెక్కల కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ఇందిరమ్మ ఇండ్ల పరిశీలనలో ఎంపీడీవో జలంధర్ రెడ్డి

**• ఉపాధి హామీ కూలీలతో మాటామంతి**





**తొలి అక్షరం/వలిగొండ, మే 20:** అలాగే గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు.అనంతరం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి, పనుల లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు రోజు వంద కూలీలు ఉదయం 6 గంటల వరకు హాజరు కావాలని తెలిపారు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ తో కలిసి ఫీడర్ వర్క్ పర్యవేక్షించారు. కూలీలకు టెంట్, తాగటానికి మంచి నీరు మిగతా వసతులు ఉండేలా చూసుకోవాలని తెలిపారు, రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో కూలీలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

**• ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించాలి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో మే 20:** రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు చేర్చాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులు ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, జిల్లాలోని సిరోలు మండలం మన్నెగూడెం, మరిపెడ లలో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (ఫ్యాక్స్) ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్రాలలో ఇప్పటివరకు వచ్చిన ధాన్యం వివరాలు ప్రస్తుతం నిల్వ ఉన్న వివరాలు మిల్లులకు గోదాములకు పంపిన ధాన్యం వివరాల ఇన్వార్డ్ అవుట్ వార్డు రిజిస్టర్ ను, ట్యాబెట్ ఎంట్రీ, మాస్టర్ రైతులు , వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు, ఇప్పటికే మక్క జొన్న, ధాన్యం కొనుగోళ్ల లో ప్రత్యేక అధికారులు, తహసీల్దారులను నియమించడం జరిగిందని వారి పర్యవేక్షణలో ప్రతి ఒక్కరు ఒక కేంద్రానికి నిబద్ధత కలిగిన అధికారిని నియమించి ప్రతినిత్యం కొనుగోలు రవాణా విషయాలలో వేగంగా పనిచేస్తూ లక్ష్యాలను చేరుకునే దిశగా ఉన్నారని అదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు.రైతులకు ఇబ్బంది కలిగే విధంగా ఎవరూ ప్రవర్తించకూడదని కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఉండాలని, గన్నీ సంచులు, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని, లోడింగ్ అన్లోడింగ్ లో వేగం పెంచాలని, సాధ్యమైనంత త్వరగా స్థానిక వాహనాలను హమాలీలను సమకూర్చుకొని ధాన్యాన్ని తరలించాలన్నారు.జిల్లాలో సరిపడంతా ప్రదేశాలు మిల్లులు, గోదాములలో ఉందని లారీ కాంట్రాక్టర్స్ ఆ దిశగా తరలించాలని సూచించారు. ఈ పర్యటన లో కలెక్టర్ వెంట డిఆర్డిఓ ప్రాజెక్ట్ అధికారి మధుసూదన రాజు, జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, పౌరసరఫరాల శాఖ అధికారి రమేష్, డిస్టిక్ మేనేజర్ నరసింహారావు, సిరోలు, మరిపెడ మండలాల తహసిల్దార్లు కృష్ణవేణి, పున్నం చందర్, తదితరులు ఉన్నారు.

# దివ్యాంగత శరీరానికే పరిమితం ....సంకల్పానికి కాదు

**పట్టుదల ,క్రమ శిక్షణ,ఆత్మవిశ్వాసం ఉంటే ఏ లక్ష్యమైన సాధ్యమే.... శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్**

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో మే 20:** దివ్యాంగత శరీరానికే పరిమితం సంకల్పానికి కాదని శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్ అన్నారు. బుధవారం పురపాలక సంఘ పరిధిలోని ఎంపీపీఎస్ లో భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ సహకారంతో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల చేపట్టిన ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వైద్యులు భూక్య మురళి నాయక్ పాల్గొని దివ్యాంగులకు అవసరమైన పరికరాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ దివ్యాంగుల జీవితం సులభతరం కావడానికి అవసరమైన ట్రై సైకిళ్ళు, వీల్ చైర్లు,వాకింగ్ స్టిక్స్,మరియు శ్రావణ యంత్రాలు లబ్ధిదారులకు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు..అంతే కాకుండా ప్రభుత్వ ప్రభుత్వ



సంక్షేమ పథకాలను దివ్యాంగులకు మరియు అణగారినా వర్గాలకు చేరవేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు...వారికి సమాజంలో సమాన అవకాశాలు కల్పించడంలో ఇటువంటి పరికరాలు ఎంతో దోహదపడుతుందని అన్నారు.అంతేకాకుండా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్య, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని




నిరుపేదలకు,దివ్యాంగులకు అందుబాటులో ఉండడమే తమ ప్రధాన బాధ్యత అని అన్నారు.అంతేకాకుండా దివ్యాంగులు తమ దివ్యాంగతను జయించి IAS/IPS స్థాయికి ఎదిగిన ప్రముఖులు చాలా మందికి స్ఫూర్తి దయకమని ముఖ్యంగా దివ్యాంగులు గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే దివ్యాంగత శరీరానికే పరిమితం కానీ తమ సంకల్పానికి కాదని పట్టుదల ,క్రమశిక్షణ , ఆత్మవిశ్వాసం ఉంటే ఏ లక్ష్యమైన సాధించవచ్చు అని అన్నారు.ఈ కార్యక్రమంలో పురపా లక సంఘు చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సత్యనారాయణ,స్థానిక వార్డు కౌన్సిలర్ కాటా భాస్కర్, వివిధ వార్డుల కౌన్సిలర్ లు జిల్లా నాయకులు , పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా వరద రాజేశ్వర్ రావు జన్మదిన వేడుకలు

**పరిస్థితులు మారినా,కాలం మారినా తన వైఖరిలో స్థిరత్వం కోల్పోని నాయకుడు**

**జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ కందుకూరి రజినీకాంత్...**

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని, ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడు వరద రాజేశ్వర్ రావు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమానులు,మిత్రులు, రాజకీయ అనుచరులు ఘనంగా అభినందనలు తెలియజేస్తున్నారు.ఈ సందర్భంగా టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ కందుకూరి రజినీకాంత్ మాట్లాడుతూ... పదవులు శాశ్వతం కావు...వ్యక్తిత్వం,గౌరవం శాశ్వతం" అనే మాటలకు నిదర్శనంగా నిలిచే నాయకుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు అని పేర్కొన్నారు.ప్రజలతో మమేకమై,నమ్మకాన్ని సంపాదించి,రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్న నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.పట్టువదలని విక్రమార్కుడు", వరంగల్ కింగ్ మేకర్"గా గుర్తింపు పొందిన ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు రాజకీయ ప్రస్థానం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.రాజకీయాల్లో నిబద్ధత, వ్యక్తిగత సంబంధాల్లో ఆప్యాయత, నాయకత్వంలో ధైర్యం ఆయనను ప్రత్యేక వ్యక్తిత్వంగా నిలబెట్టాయని కొనియాడారు.రాజకీయ పరిస్థితులు మారినా, కాలం ఎలా మారినా తన వైఖరిలో స్థిరత్వం కోల్పోని నాయకుడిగా ఆయన నిలిచారని పేర్కొన్నారు. ఎంత మంది ఎన్ని బొమ్మలు మార్చినా... అప్పుడు, ఇప్పుడు,ఎప్పుడూ ఒక్కటే బొమ్మ" అంటూ ఆయన వ్యక్తిత్వ స్థిరత్వాన్ని అభిమానులు ప్రశంసిస్తున్నారని తెలిపారు.ప్రజలతో మమేకమయ్యే స్వభావం, కార్యకర్తల పట్ల ఆప్యాయత,తనను నమ్ముకున్న వారిని ఎప్పటికీ మరవని మనస్తత్వం వరద రాజేశ్వర్ రావును ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిపాయని రజినీకాంత్ పేర్కొన్నారు. పదవులు వచ్చి పోతాయని,కానీ వ్యక్తిత్వం మాత్రమే శాశ్వతమని ఈ సందర్భంగా గుర్తు చేశారు.పెద్దా యనను అత్యంత దగ్గరగా చూసిన వ్యక్తిగా... ఏదైనా వరద రాజేశ్వర్తోనే, వరద రాజేశ్వర్ రావు ద్వారానే, వరద రాజేశ్వర్ కోసమే" అంటూ తన అనుబంధాన్ని భావోద్వేగంగా వ్యక్తం చేశారు.ఆయన చూపిన





మార్గదర్శకం,అందించిన ప్రోత్సాహం జీవితాంతం మరిచిపోలేనివని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వరద రాజేశ్వర్ రావుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ.... ఆయురారో గ్యాలతో ,ఆనందాలతో,మరెన్నో విజయాలతో ప్రజాసేవ లో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# పెట్రోల్,డీజిల్ ధరల పెంపుపై కాంగ్రెస్ నిరసన

**మోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేసి ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ శ్రేణులు..**

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** పెరిగిన పెట్రోల్,డీజిల్ ధరలకు నిరసనగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.హనుమకొండ డీసీసీ భవన్ నుంచి అశోక జంక్షన్ వరకు మోదీ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ...ఎన్నికలు పూర్తైన వెంటనే పెట్రోల్,డీజిల్ ధరలను పెంచడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రజలపై అదనపు భారం మోపిందని విమర్శించారు.అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ దేశంలో ఇంధన ధరలు పెరగడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి



నిదర్శనమని అన్నారు.బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేందుకు సామాన్య ప్రజల జేబులు ఖాళీ చేస్తోందని ఆరోపించారు.పెరిగిన ఇంధన ధరల ప్రభావం అన్ని నిత్యావసర వస్తువుల ధరలపై పడుతూ మధ్యతరగతి,పేద ప్రజల జీవనాన్ని మరింత భారంగా మారుస్తోందని పేర్కొన్నారు.రైతు నుంచి ఆటో డ్రైవర్ వరకు ప్రతి వర్గం ఈ ధరల పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. "అచ్చే దిన్" పేరుతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలకు "భారాల దిన్" చూపిస్తోందని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని,పెంచిన ఇంధన ధరలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆవేదనను కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకుని ధరలు తగ్గించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,మాజీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, తాజా మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్,పోతుల శ్రీమాన్,మాధవి,జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ,నాయకులు నాయిని లక్ష్మా రెడ్డి,బంక సంపత్,తౌటం రవీందర్,అలువాల కార్తీక్,తోట పవన్,గుంటి స్వప్న,సాగరిక డివిజన్ అధ్యక్షులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కళాకారులే... క్రాంతికారులై..

**పర్యావరణ పరిరక్షణపై కవులు, కళాకారులు, మేధావుల సదస్సు..**

**ముఖ్య అతిథిగా గోరటి వెంకన్న..**

**కడ్తాల్ మండలం అల్మాస్ పల్లిలో కార్యక్రమం..**

**తొలి అక్షరం/షాద్ నగర్, మే 20:** తమ పాటలతో, ఆటలతో, నాటకాలతో ప్రజలలో చైతన్యం తెచ్చి వారిని రంజింపజేసే కళాకారులు మరో అడుగు ముందుకు వేసి సామాజిక సమస్యలపై కూడా కార్యక్రమాల నిర్వాహణకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా కడ్తాల్ మండలంలోని అల్మాస్ పల్లి గ్రామంలో



పర్యావరణ రచయితల సమ్మేళనం పేరిట రెండు రోజుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మొదటి రోజు కార్యక్రమం ఈరోజు కొనసాగింది. పర్యావరణ పరిరక్షణ, పాఠశాలల్లో ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్సీ, సినీ, ప్రజాకవి గోరటి వెంకన్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కాగా, కవి గాయకుడు జయరాజ్ మరో అతిథిగా హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణ పై ప్రజల్లో బాధ్యత పెంచేందుకు



నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేధావులు, రచయితలు, విద్యావంతులు పాల్గొన్నారు. ఎల్ ఎన్ ఆర్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో షాద్ నగర్ పట్టణానికి చెందిన కవులు, రచయితలు హర్మల్ రవి ప్రకాష్, నరేందర్ రావు పాల్గొన్నారు.

# అమీనా ప్రతిభకు తెలంగాణ రక్షణ సేన అభినందనలు
# ముస్లిం మహిళలు ఉన్నత చదువుల్లో రాణించాలి

**తెలంగాణ రక్షణ సేన ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి ముస్తఫా**



**తొలి అక్షరం/షాద్ నగర్, మే20:** ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాలలో కేశంపేట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అమీనా 600 మార్కులకు గాను 581 మార్కులు సాధించి అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి ముస్తఫా ఆధ్వర్యంలో విద్యార్థిని అమీనాను, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. విద్యార్థిని అమీనాకు శాలువా కప్పి, స్వీట్లు తినిపించి, బహుమతిని అందజేసి తమ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అమీనా రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత చదువులు చదివి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. అలాగే, పైచదువుల నిమిత్తం తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎండి ముస్తఫా భరోసా ఇచ్చారు. **ముస్లిం మహిళా సాధికారత** ముస్లిం మహిళలు విద్యారంగంలో ముందడుగు వేయాలని, ఉన్నత చదువులు చదివి సమాజంలో గౌరవప్రదమైన స్థానాల్లో రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. "చదువు ఒక్కటే పేదరికాన్ని పారద్రోలే ఆయుధం. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడే సమాజంలో మనకు తగిన గుర్తింపు లభిస్తుంది. **తెలంగాణ రక్షణ సేన హామీ** రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం ఏర్పడ్డాక, రాష్ట్రంలోని పేద ప్రజలకు, బడుగు బలహీన వర్గాల వారందరికీ సంపూర్ణ ఉచిత విద్యను అందజేస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తమ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన విద్యార్థి విభాగం నాయకుడు మహేష్ కుమార్, తెలంగాణ రక్షణ సేన నాయకులు నవీన్ కుమార్, బాలాజీ ఉదయ్, రవి, రాజు, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జీవితాలతో ఆడుకోకండి మోదీజీ..

**పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై లారి ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సాధిక్..**

**లారీ ఓనర్లు, డ్రైవర్ల జీవితాలను రోడ్డున పారేస్తున్నారు..**

**ఇన్నిసార్లు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ఎప్పుడూ చూడలేదు..**

**మీ వల్ల బతుకుదారులన్నీ మూసుకుపోతున్నాయి..**

**ధరలు తగ్గించకపోతే ఆందోళన తప్పదు: సయ్యద్ సాదిక్**

**తొలి అక్షరం/షాద్ నగర్, మే 20:** పెట్రోలు, డీజిల్ ధరలను మాటకు ముందు పెంచుతూ లారీ ఓనర్లు, డ్రైవర్లు, చిరు వ్యాపారుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆడుకుంటుందని లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, షాద్ నగర్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాధిక్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి మోదీజీ తీసుకుంటున్న ఈ నిర్ణయం వల్ల ఎంతోమంది జీవితాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. మూడు రోజుల క్రితం పెట్రోలు డీజిల్ ధరలు పెంచేసి ప్రజలను అగాధంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం తాజాగా తిరిగి మళ్లీ డీజిల్ ధరలను పెంచడం దారుణమని ఆయన అన్నారు. గతంలో ఎప్పుడూ ఇలా జరిగేది కాదని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా చమురు ధరలు స్థిరంగా ఉండేవని అన్నారు. ప్రభుత్వాలు నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలు చిరు వ్యాపారాల ద్వారా బతుకుతున్న వారిని దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుందని, కానీ ప్రస్తుత బిజెపి ప్రభుత్వం ఉన్నవారికి వత్తాసు పలుకుతూ లేని వారిని రోడ్డును పడవేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి వెంటనే పెంచిన రేట్లు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎక్కడి లారీలను అక్కడే నిలిపివేసి ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడం వల్ల సామాన్యులపై విపరీతమైన భారం పడుతుందన్న కనీస జ్ఞానం కూడా ప్రభుత్వానికి లేకపోవడం దురదృష్టకరమన్నారు. పెట్రో ధరలను అదుపులోకి తెలియకపోతున్న అసమర్థ ప్రభుత్వంగా భారతీయ జనతా పార్టీ మిగిలిపోతుందని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరవకుంటే రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. లారీ ఓనర్ లను, డ్రైవర్లను, చిరు వ్యాపారులను, రైతులను దృష్టిలో ఉంచుకొని చమురు ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన కోరారు. లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.



# డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే వేటు

**● మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో ముమ్మర తనిఖీలు ● 987 కేసులు నమోదు..రూ.3.96 లక్షల జరిమానా ● మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు..కోర్టుకు ఛార్జ్‌షీట్లు**

**Malkajgiri Commissionerate Special Drive Cases on W/o Driving License & Minor driving Dt: (20.05.2026).**

| S.No | Police station | W/o Driving License | | W/o Carrying Driving License | | Minor driving (Charge sheet) | Grand Total | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | Cases | Amount | Cases | Amount | | Total Cases | Total Amoun |
| 1 | Malkajgiri Tr PS | 50 | 25000 | 10 | 1000 | | 60 | 26000 |
| 2 | Gopalpuram Tr PS | 50 | 2500 | 7 | 700 | 3 | 60 | 3200 |
| 3 | Jawaharnagar Tr PS | 64 | 32000 | 3 | 300 | | 67 | 32300 |
| 4 | Trimulgherry Tr PS | 104 | 51500 | 4 | 400 | 12 | 120 | 51900 |
| 5 | Alwal Tr PS | 78 | 39000 | 46 | 4600 | 8 | 132 | 43600 |
| 6 | Begumpet Tr PS | 69 | 34500 | 43 | 4300 | 24 | 136 | 38800 |
| Zone- I | | 415 | 184500 | 113 | 11300 | 47 | 575 | 195800 |
| 1 | LB Nagar Tr PS | 124 | 62000 | 22 | 2200 | | 146 | 64200 |
| 2 | Vanasthalipuram Tr PS | 102 | 51000 | 19 | 1900 | 8 | 129 | 52900 |
| 3 | Uppal Tr PS | 73 | 36500 | 8 | 800 | | 81 | 37300 |
| 4 | Kushaiguda Tr PS | 48 | 24000 | 18 | 1800 | 4 | 70 | 25800 |
| 5 | Ghatkesar Tr PS | 41 | 20500 | 4 | 400 | | 45 | 20900 |
| Zone- II | | 388 | 194000 | 71 | 7100 | 12 | 471 | 201100 |
| Total | | 803 | 378500 | 184 | 18400 | 59 | 1046 | 396900 |

**Section:**
W/o Driving License (S 181/177)
Minor driving the vehicle under the age of 18 years (S 180, 181 of M.V.Act)

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),మే20:** రహదారి భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు బుధవారం కమిషనరేట్ వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు (స్పెషల్ డ్రైవ్) చేపట్టారు. మోటారు వాహనాల చట్ట నిబంధనలను ఉల్లంఘించి, సరైన డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై అలాగే మైనర్ డ్రైవింగ్‌పై ట్రాఫిక్ జోన్-1, జోన్-2 పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఏకకాలంలో ఈ తనిఖీలు నిర్వహించారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి,ఐపీఎస్ ఆదేశాల మేరకు.. ట్రాఫిక్ డీసీపీ-1, డీసీపీ-2ల పర్యవేక్షణలో ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ట్రాఫిక్ సిబ్బంది ఈ ప్రత్యేక డ్రైవ్‌లో చురుగ్గా పాల్గొన్నారు. ప్రధాన కూడళ్లు, రద్దీగా ఉండే ట్రాఫిక్ కారిడార్లలో తనిఖీ బృందాలను రంగంలోకి దించి ఉల్లంఘనదారులను గుర్తించారు.

**ఒక్కరోజే భారీగా కేసులు:**

ఈ తనిఖీల్లో సరైన డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రోడ్లపైకి వచ్చిన వాహనదారులపై మొత్తం 987 కేసులు నమోదు చేశారు. వారికి రూ. 3,96,900 జరిమానా విధించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న 59 మంది మైనర్లను గుర్తించి, వారిపై చట్టప్రకారం ఛార్జ్‌షీట్లు దాఖలు చేసి కోర్టుకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు.

**తల్లిదండ్రులకు హెచ్చరిక:**

మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల సరైన శిక్షణ, అవగాహన లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్ అనేది పిల్లల ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా తీవ్ర ముప్పు కలిగిస్తోంది. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు, వాహన యజమానులదే పూర్తి బాధ్యత. వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. -డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్), మల్కాజ్‌గిరి పౌరులందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారే వాహనాలు నడిపేలా చూసుకోవాలని రహదారి భద్రతకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను అరి కట్టడానికి, ప్రజల భద్రతను కాపాడటానికి ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.



# సెంట్రింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికై
# సమ్మె బాట పట్టిన కార్మికులు



**తొలి అక్షరం/షాద్ నగర్, మే20:** భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న సెంట్రింగ్ కార్మికులు తమ సమస్యలకోసం పనులు బంద్ చేయాలని నిర్ణయించినట్లు షాద్ నగర్ సెంట్రింగ్ అసోసియేషన్ అధ్యక్షులు నడికూడ ఆంజనేయులు యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా షాద్ నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... భవన నిర్మాణ రంగంలో అత్యంత ప్రమాద భరితమైన పని అని, గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ పనిలో మరణిస్తే 10 లక్షల రూపాయల నష్ట పరిహారం చెల్లిస్తున్నారని దానిని 20 లక్షల రూపాయలకు పెంచాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై గత 6 సంవత్సరాలుగా పోరాటం చేస్తుంటే ఏ ప్రభుత్వాలు పట్టించుకోక పోవడంతో ఈ సమ్మె చేస్తున్నట్లు ఇది తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని తెలిపారు. అలానే కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు కార్డు లేకున్నా పనిలో మరణిస్తే పోలీస్ కేసు ఆధారంగా నష్ట పరిహారం చెల్లించాలని, నిర్మాణ ప్రదేశాలలో దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పుడు ఉన్న స్కేర్ ఫీట్ రేట్ ను పెంచాలని, ప్రతి యూనిట్ కు 300 గజాల స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రంగంపల్లి ఆంజనేయులు, అధ్యక్షులు నడికూడ ఆంజనేయులు యాదవ్, ఉపాధ్యక్షులు సబావత్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి పత్లావత్ రమేష్ నాయక్ , కోశాధికారి టేకులపల్లి నర్సింలు, శ్రీను కు నాయక్, చందు, అలిబయి, రాములు, చౌలపల్లి రవి, రామచంద్ర, సూర్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పడమటి గూడెంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**తొలి అక్షరం /నర్సింహులపేట మే 20:** ఇటీవల వివిధ ఆస్పత్రిలో వైద్యం చేయించుకొని ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న ఆరు గురు పిట్టల అశోక్ 57,000 /-, పాతూరి సురేష్ రెడ్డి50,000/-, కంబాల లింగ మల్లమ్మ 60,000 /-,నవ్య 25000/- దాస రోజు రామబ్రహ్మం 11,000/-, పాతూరి యాదగిరి 26,000 లు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరయ్యాయి. చెక్కుల ను నర్సింహులపేట మండలం పడమటి గూడెం గ్రామంలో గ్రామ సర్పంచ్ జక్కుల ఉప్పలయ్య , ఉప సర్పంచ్ నవీన్ రెడ్డి బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ చిర్ర సతీష్ గౌడ్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ కోదండరాంను కలుసుకున్న షాద్‌నగర్ తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్




**తొలి అక్షరం/షాద్ నగర్,మే 20:** తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి వెంకట్ రాంరెడ్డి మాజీ జడ్పీటీసీ ఫరూఖ్ నగర్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ ఆయన సందర్భంగా సన్మానసం జరిగింది తదుపరి ఉద్యమ కాలం గురించి మాట్లాడడం జరిగింది గ్రామీణ స్థాయిలో ఉన్న ఉద్యమకారులను విద్యార్థి నాయకులను ఆర్టీసీ కార్మికులు ప్రతి ఒక్కరిని ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించాలని కోరడం జరిగింది. ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించడానికి విధివిధానాలు ఆలోచిస్తున్నా మని చెప్పారు కార్యక్రమంలో వారు. పినపాక ప్రభాకర్,, టి జీ శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, కాదే సుధాకర్, కావాలి యాదగిరి, రవి గౌడ్, మేకల వెంకటేష్, సిదం విటలయ్య, దొడ్డి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యంతో రాజీ లేదు..! బంద్ కంటే సేవే గొప్పది
## ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి మునిగంటి రమేష్

**● మహబూబాబాద్ జిల్లాలో యథావిధిగా కొనసాగిన మెడికల్ సేవలు.. ప్రజల పక్షాన నిలిచిన ఫార్మసిస్టులు! ● లైసెన్స్ రెంటింగ్ అక్రమాలపై ఉక్కుపాదం మోపాలి.. అర్హత కలిగిన ఫార్మసిస్టులకే ప్రాధాన్యం ఇవ్వాలి!**



**తొలి అక్షరం/ఇనుగుర్తి మే 20:** మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఇచ్చిన బంద్ పిలుపుకు ప్రజలు, ఫార్మసిస్టుల నుంచి పెద్దగా స్పందన లభించలేదని ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి మునిగంటి రమేష్ తెలిపారు. జిల్లాలో అధిక శాతం మెడికల్ షాపులు సాధారణ రోజుల మాదిరిగానే పనిచేస్తూ ప్రజలకు నిరంతరాయంగా మందులు అందించాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని భావించిన అర్హత కలిగిన ఫార్మసిస్టులు సేవలను నిలిపివేయకుండా తమ బాధ్యతను నిర్వర్తించారని రమేష్ కొనియాడారు. అత్యవసర పరిస్థితుల్లో మందుల కోసం వచ్చే రోగులు ఇబ్బందులు పడకుండా ఫార్మసిస్టులు అప్రమత్తంగా వ్యవహరించారని తెలిపారు. కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం బంద్ పేరుతో ఒత్తిడి తీసుకురావాలని ప్రయత్నించినప్పటికీ.. నిజమైన సేవా దృక్పథం కలిగిన ఫార్మసిస్టులు మాత్రం ప్రజల పక్షాన నిలిచారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మునిగంటి రమేష్ మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో పెరుగుతున్న అక్రమాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఫార్మసీ అనేది కేవలం మందుల విక్రయం కాదు.. అది ప్రజల ప్రాణాలను కాపాడే ఆరోగ్య సేవ. ప్రస్తుతం 'లైసెన్స్ రెంటింగ్' పేరుతో జరుగుతున్న అక్రమాలు ఫార్మసీ వ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయి. చదువుకున్న, రిజిస్ట్రేషన్ కలిగిన ఫార్మసిస్టుల ద్వారానే మందుల పంపిణీ జరగాలి. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి" అని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సేవలను కొనసాగించిన ప్రతి ఫార్మసిస్టుకు ప్రత్యేక అభినందనలు తెలియజేసిన రమేష్.. భవిష్యత్తులో కూడా ఫార్మసిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలకు నాణ్యమైన ఔషధ సేవలు అందేలా తమ సంఘం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# దాడులు, వేధింపులు తట్టుకోలేక దళితురాలు చెన్నమ్మ ఆత్మహత్య



మృతురాలు చెన్నమ్మ ఫైల్ ఫోటో

- నాలుగు రోజులుగా న్యాయం కోసం నిరీక్షణ
- పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగినా దొరకని న్యాయం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాక కూడా నిందితుల దౌర్జన్యం
- ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య
- కొందుర్గు మండలం తంగెళ్లపల్లి గ్రామంలో ఘటన
- ఎద్దు నరేష్, సురేష్, లక్ష్మమ్మ, అనిత, స్వరూపలపై మృతురాలి ఫిర్యాదు
- తన చావుకు కారణం వీరే అంటూ శుభలేఖ పై రాసి ఉరి వేసుకున్న వైనం

**తొలి అక్షరం/కొందుర్గు, మే 20:** ఏదైనా అన్యాయం జరిగితే పోలీస్ స్టేషన్ వెళితే న్యాయం జరుగుతుందని స్వాంతన చేకూరుతుందని ఆశిస్తాం.. బాధ్యతగల పోలీసులు ఫిర్యాదులు స్వీకరించాక వెంటనే సంఘటనను అర్థం చేసుకొని స్పందిస్తే ఎలాంటి ఘర్షణలు గొడవలు ఉండవు.. కానీ ఫిర్యాదుల విషయంలో సాగదీత ధోరణి బాధితుల ప్రాణం మీదకు తెస్తుందనడానికి ఈ సంఘటన ఒక నిదర్శనం. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలం తంగెళ్లపల్లి గ్రామానికి చెందిన ఎద్దు చెన్నమ్మ అనే దళిత మహిళ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎద్దు సురేష్ ఎద్దు నరేష్ లక్ష్మమ్మ అనిత స్వరూపలు ఇటీవలే చెన్నమ్మపై దాడికి పాల్పడ్డారు. ఇంటి మీదికి వచ్చి దౌర్జన్యానికి పాల్పడుతూ.. నాన్న బూతులు తిడుతూ తీవ్రంగా అవమానించారు. దీనిపై చిన్నమ్మ అతని కుమారుడు ఎద్దు సందీప్ తో కలిసి మూడు రోజుల క్రితం కొందుర్గు పోలీస్ స్టేషన్ లో లిఖితపూర్వకంగా వారిపై ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు ఈ వ్యవహారంలో సరైన రీతిలో స్పందించలేదని చెన్నమ్మ కుమారుడు సందీప్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు ఇచ్చాక వారిని పిలిపిస్తే కూడా రాలేదని ఆ తర్వాత కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలి వేయడంతో ఏం చేయాలో తెలియక తమను రక్షించేవారు ఎవరని బాధపడుతూ తన తల్లి చెన్నమ్మ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఈ సమయంలో ఇంట్లో ఉన్న ఒక శుభలేఖ కార్డుపై 90 దాడి చేసిన వారి పేర్లు రాసి ఉరివేసుకొని చనిపోయిందని కుమారుడు సందీప్ కన్నీరు మున్నీరుగా విలపించాడు.

**పోలీసుల నిర్లక్ష్యం..** కొందుర్గు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన తర్వాత కూడా సరైన రీతిలో చర్యలు తీసుకోకపోవడంతో చిన్న తీవ్ర మనస్థాపానికి గురైంది. తమను ఎవరు ఏం చేసినా అడిగేవారు లేరని ఇక చావే దిక్కని చన్నమ్మ చనిపోయినట్లు ఈ సంఘటనలో అవగతం అవుతుంది. ఫిర్యాదు స్వీకరించాక వెంటనే నిందితులను పిలిపించి విచారణ జరిపి కావాల్సిన చర్యలు తీసుకొని ఉంటే బాధితులకు కొండంత ధైర్యం కలిగేది. కానీ చేన్నమ్మ సంఘటనలో సంబంధిత పోలీసులు అలా చేయలేదు. ముఖ్యంగా గ్రామ పెద్దల



ఆత్మహత్యకు పాల్పడ్డ చెన్నమ్మ

రాజకీయ జోక్యం కొందరిది తోడు కావడంతో రాజకీయంగా బాధితులకు అన్యాయం జరిగినట్లు ఇప్పుడు గ్రామంలో చర్చ జరుగుతుంది. గ్రామంలో ఎవరు ఫిర్యాదు చేసిన పోలీస్ స్టేషన్లో ముందే వాలిపోయే పెద్దల తీరుతో గ్రామస్తులు బాధితులు బేజారు చెందుతున్నారని చెబుతున్నారు. చిన్నమ్మకు కాస్త భరోసా కల్పించి న్యాయం జరుగుతుందన్న అండ దొరికి ఉంటే ఆమె భయపడి ఆత్మహత్యకు పాల్పడేది కాదని అంటున్నారు.

**తంగేళ్లపల్లిలో ఫ్యాక్షన్ రాజకీయం.. పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి** తంగేళ్లపల్లి గ్రామంలో ఫ్యాక్షన్ రాజకీయాలను తలపించే విధంగా ఉంటాయని బిజెపి నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చేన్నమ్మ మృతి పట్ల విష్ణువర్ధన్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆమె మృతదేహాన్ని పరిశీలించారు. చేన్నమ్మ కుమారుడు సందీప్ ను సముదాయించారు. ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తంగేళ్ళపల్లి రాజకీయాలు అత్యంత దౌర్భాగ్యమని అన్నారు. చెన్నమ్మకు పోలీసులు సరైన రక్షణ కల్పించి ఉంటే ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడేది కాదని అన్నారు. ఫిర్యాదు స్వీకరించిన అనంతరం పోలీసులు ఆమెకు న్యాయం చేసి ఉంటే నిర్లక్ష్యం చేయక పోయి ఉంటే ఆమె ఆత్మహత్యకు పాల్పడేది కాదని విచారం వ్యక్తం చేశారు.చెన్నమ్మ మృతి పై పోలీసుల నిర్లక్ష్యం నశించాలని దీనిపై ప్రత్యేక విచారణ జరిపించాలని డిసిపిని అవసరమైతే కమిషనర్ ను కలుస్తానని దీనిపై సంబంధిత అధికారిపై చర్య తీసుకోవాలని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కేసులో పూర్తి నిర్లక్ష్యం ఎక్కడ జరిగిందో పూర్తి సాక్షాదారాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. చెన్నమ్మపై దాడి జరిగిన వీడియోలు కూడా ఉన్నాయని దౌర్జన్యం చేసిన వీడియోలు కూడా ఉన్నాయని అయినప్పటికీ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడానికి గల కారణాలను ఉన్నదధికారులు సమీక్షించాలని చర్యలు చేపట్టాలని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ముఖ్యంగా తంగేళ్లపల్లిలో జరుగుతున్న నాటకీయ పరిణామాలు రాజకీయాలు కక్ష కార్పన్యాలకు మూల స్తంభంగా నిలుస్తున్న విషయాలను దృష్టిలో పెట్టుకుని పోలీస్ స్టేషన్లో అధికారి నిష్పక్షపాతంగా గమనించాల్సిన అవసరం ఉందన్నారు.

# పోలీసుల వల్లే మా అమ్మ నాకు దూరమైంది

- మృతురాలు చెన్నమ్మ కుమారుడు ఎద్దు సందీప్ కన్నీటి పర్యంతం
- ఇలాంటి పరిస్థితి మరెవరికి రావద్దు
- పోలీసుల తీరు మారాలి - బిఆర్ఎస్ నేత రామకృష్ణ
- పోలీసులపై ఎస్సీ కమిషన్ తదితరు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తా
- పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి స్పష్టికరణ

**తొలి అక్షరం/కొందుర్గు, మే 20:** పోలీసులు మా ఫిర్యాదు తీసుకొని చర్యలు తీసుకొని ఉంటే ఈరోజు మా అమ్మ బ్రతికి ఉండేది మామ చావుకు పోలీసుల కారణం అంటూ కొందుర్గు మండలం తంగెళ్లపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు ఎద్దు సందీప్ వాపోయాడు. గ్రామానికి చెందిన చెన్నమ్మ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో బిజెపి నేత పాలమూరు



విష్ణువర్ధన్ రెడ్డి అదే విధంగా బిఆర్ఎస్ నేత తంగేళ్ళపల్లి రామకృష్ణ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మృతురాలి కుమారుడు సందీప్ మాట్లాడుతూ.. పిటిషన్ ఇచ్చాక పోలీసులు పట్టించుకోని తమకు న్యాయం చేసి ఉంటే ఈరోజు మా అమ్మ చేన్నమ్మ బ్రతికి ఉండేదని మా అమ్మ చావుకు పోలీసులే కారణం అంటూ సందీప్ కంటతడి పెట్టారు. తనలాంటి పరిస్థితి మరి ఎవరికి రావద్దని అతను మీడియా ముందు కన్నీటి పర్యంతం అయ్యాడు. అదేవిధంగా ఈ ఘటనపై బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. జరిగిన ఘటనపై శాఖ పరమైన చర్యతో పాటు సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఎస్సీ కమిషన్ను ఆశ్రయిస్తానని ఉన్నతాధికారులను కూడా ఆశ్రయిస్తానని తెలిపారు. బాధితులకు అండగా నిలబడకుండా రాజకీయాలకు తలొగి బాధితులకు అన్యాయం చేసిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకునే విధంగా తాను పోరాడతానని హెచ్చరించారు.

**రాజకీయాలు శాశ్వతం కావు - రామకృష్ణ**

రాజకీయాలు ఎన్నటికీ శాశ్వతం కావని తంగెళ్లపల్లి బిఆర్ఎస్ నేత రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. చిన్నమ్మ మృతికి పోలీసుల నిర్లక్ష్యమే కారణం స్పష్టంగా కనిపిస్తుందని పిటిషన్ ఇచ్చిన తర్వాత నిందితులను పిలిపించి విచారించి సరైన చర్యలు తీసుకొని ఉంటే ఈరోజు చిన్న ఆత్మహత్య చేసుకునేది కాదని విచారణ వ్యక్తం చేశారు. గ్రామంలో రాజకీయ పలుకుబడి తదితర ఒత్తిడిలకు గురై బాధితులకు న్యాయం జరగకుండా చేశారని ఇది సమంజసం కాదని తెలిపారు. పార్టీలకు అతీతంగా ఇలాంటి దుష్పరిణామాలపై చర్చించాల్సిన అవసరం ఉందని అఖిలపక్షం ఏర్పాటు చేసి గ్రామాలపై రాజకీయ నీడలు ఉండకూడదని రామకృష్ణ ఆశించారు. బాధితుడు సందీప్ పరిస్థితి చూస్తుంటే ఎంతో బాధగా ఉందని న్యాయం చేయాల్సిన పోలీసులు ఇలా చర్యలు తీసుకోకపోవడం వల్లే చెన్నమ్మ ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. ఇకనైనా పోలీసుల తీరు మారాలని సూచించారు.

# ట్రంప్ అధికారాలకు కత్తెర

ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..తనకేమీ పట్టనట్టు ట్రంప్ మహాశయుడు ఫిడేల్ వాయిస్తున్నాడు. యుద్ధం ..యుద్ధం అంటూ కలవరిస్తున్నారు. ఇరాన్‌పై దాడులు తప్పవని హెచ్చరిస్తున్నాడు. అయితేపశ్చిమాసియా యుద్ధానికి సంబంధించి తాజాగా తీవ్ర ఉత్కంఠ పరిణామాలు చకచకా చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం తెరవెనక సాగుతున్న చర్చల్లో ఒప్పందం కుదరకుంటే... 2-3 రోజుల్లోనే.. లేదంటే వచ్చే వారం ఆరంభంలో తాము ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దీంతో మరోమారు ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇప్పటికే అమెరికా సహా అన్ని దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నా ట్రంప్ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ కళ్ళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. దీంతో అయినా ట్రంప్ దూకుడు ఆగతుందా అన్నది చూడాలి. ఇకపోతే ఇరాన్‌తో భారీస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, అవి సఫలమై.. మా దాడి ప్రణాళిక శాశ్వతంగా అటకెక్కుతుందని ఆశిస్తున్నా అంటూ ట్రంప్ తాజాగా వెల్లడించాక ఈ తీర్మనం వచ్చింది. టెహ్రాన్ చేతికి అణ్వాయుధాలు దక్కకుండా ఉండే ఒప్పందం మాకు ఆమోదయోగ్యమవుతుందని శ్వేతసౌధంలో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై భారీ స్థాయిలో వెంటనే దాడులు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని తమ అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మంగళవారమే భారీ స్థాయిలో దాడులు జరపాలనుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే అరబ్ దేశాల నేతల విజ్ఞప్తి మేరకు చివరి నిమిషాల్లో ఆ ప్రణాళికను తాత్కాలికంగా పక్కనపెట్టానన్నారు. టెహ్రాన్‌తో చర్చలు సీరియస్‌గా సాగుతున్నాయని, అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదిరే అవకాశాలు ఉండటం వల్లే దాడుల నిర్ణయాన్ని ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో ట్రంప్ వ్యవహాఇర శైలి చూస్తుంటే ఆయన దేనికైనా తెగిస్తాడని అనుకోవాలి. ఇకపోతే ఇరాన్ కూడా గట్టిగానే సమాధ్యానం ఇస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేస్తే.. తాము యుద్ధరంగంలో కొత్త సాధనాలతో, సరికొత్త విధానాల్లో విరుచుకుపడతామని ఇరాన్ హెచ్చరించింది. తమను దిగ్బంధించడం, ఓడించడం ఎవరికీ సాధ్యం కాదని పేర్కొంది. టెహ్రాన్‌లోని వాలియాస్ స్క్వేర్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆ దేశ సైన్యాధికారి బ్రిగేడియర్ జనరల్ మహమ్మద్ అక్రమినియా ఈ వ్యాఖ్యలు చేశారు. తమ సాయుధ దళాలు గతంలో కంటే ఇప్పుడు మరింత బలంగా, సన్నద్ధంగా ఉన్నాయని ఇరాన్ పేర్కొంది. సైన్యం ట్రిగ్గర్‌పై వేలు పెట్టి సిద్ధంగా ఉందని హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను హతమారిస్తే.. 58 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.560 కోట్లు) బహుమతిగా ఇస్తామని ఇరాన్ త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు 'ఇస్లామిక్ రిపబ్లిక్ భద్రతా దళాల ప్రతిచర్య' పేరిట బిల్లును సిద్ధం చేస్తున్నట్లు ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఛైర్మన్ ఇబ్రహీమ్ అజీజ్ తెలిపారు. దీనిపై త్వరలోనే పార్లమెంటులో ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. తమ దేశంలోని బరకాహ్ అణు విద్యుత్కేంద్రంపై ఇటీవల దాడి చేసిన డ్రోన్లు ఇరాక్ భూభాగం నుంచి దూసుకొచ్చాయని యూఏఈ రక్షణ శాఖ మంగళవారం వెల్లడించింది. ఇరాన్ మద్దతున్న షియా మిలీషియాలు వాటిని ప్రయోగించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఇటీవల చేసిన దాడులు పర్యావరణానికి హానికరంగా మారి, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ ఆయిల్ రిగ్ ÷ నైరీపై జరిగిన ఓ దాడితో సముద్ర జలాల్లోకి చమురు చేరి.. అలల ద్వారా పర్షియన్ గల్ఫ్‌లోని శిద్వార్ దీవిపైకి కొట్టుకొచ్చింది. అది జనావాసాల్లేని దీవి. వణ్యప్రాణులు చాలానే ఉన్నాయి. చమురు వ్యాప్తితో వాటి మనుగడకు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇవన్నీ ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. అమెరికా దూకుడు



తగ్గకుంటే ప్రపంచంలో ఆర్థిక, ఆహార సంక్షోభం తీవ్రం కానుంది. ఇప్పటికే గల్ఫ్ దేశాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయి. ఇది మరింత తీవ్రం అయ్యే ప్రమాదం ఉంటి. ఖతార్ లాంటి దేశాల్లో ఆహార కొరత తీవ్రంగా ఉంది. వారి వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో శాంతి చర్చలకు ప్రపంచ దేశాలు ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉంది.

# డ్రాగన్ గ్లింప్స్ రిలీజ్

## సోషల్ మీడియాలో షేక్



దర్శకుడు ప్రశాంత్ నీల్, తారక్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్‌ను చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటిస్తూ పవర్‌ఫుల్ ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఎన్టీఆర్ పుట్టినరోజు కానుకగా ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. మే 19 అర్ధరాత్రి తారక్ బర్త్‌డేకి కొన్ని నిమిషాల ముందే విడుదలైన ఈ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

ప్రశాంత్ నీల్ తన మార్క్ డార్క్ థీమ్‌తో ఏకంగా 4 నిమిషాల 28 సెకండ్ల నిడివితో ఒక భారీ విజువల్ వండర్‌ను ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ గ్లింప్స్ వీడియో 1967 నాటి అంతర్జాతీయ ఓపియం బ్యాక్‌డ్రాప్‌లో, గోల్డెన్ ట్రయాంగిల్ నేపథ్యంలో సాగే ఒక క్రూరమైన, హింసాత్మకమైన చీకటి ప్రపంచాన్ని కళ్లకు కట్టింది. ఇందులో హీరోయిన్ రుక్మిణి వసంత్ వాయిస్ ఓవర్‌తో కథా నేపథ్యాన్ని, అందులోని పాత్రలను పరిచయం చేస్తూ చివరగా అసలైన 'డెవిల్'ను ఎంట్రీ చేయించారు. అఫ్ఘాన్ ట్రేడింగ్ కంపెనీకి 'చీఫ్ అసస్సిన్' (ప్రధాన హంతకుడు) అయిన 'లూగర్'అనే అత్యంత భయంకరమైన పాత్రలో ఎన్టీఆర్ లుక్ మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. ఈ గ్లింప్స్‌లో ఎన్టీఆర్ రఫ్ అండ్ లీన్ లుక్, గంభీరమైన కళ్లు అభిమానులకు పూనకాలు తెప్పిస్తున్నాయి. ముఖ్యంగా ఒక సీన్ లో శవాల దిబ్బపై నిలబడి ఎన్టీఆర్ చెప్పే డైలాగ్ థియేటర్లలో విసిల్ వర్తీగా నిలవడం ఖాయం. 'దేవుడు నాకో గొప్ప వరం ఇచ్చాడు.. ట్రిగ్గర్ నొక్కగానే మర్చిపోవడం' అంటూ తారక్ బేస్ వాయిస్‌తో చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ప్రశాంత్ నీల్ సృష్టించిన ఈ సరికొత్త ప్రపంచంలో ఎన్టీఆర్ క్యారెక్టరైజేషన్ మునుపెన్నడూ చూడని విధంగా, ఒక ఊరమాస్ బీస్ట్ మోడ్లో ఉంది. ఈ భారీ యాక్షన్ డ్రామాలో బాలీవుడ్ ఎవర్ గ్రీన్ స్టార్ అనిల్ కపూర్ ఇండియన్ నార్కోటిక్స్ బ్యూరో చీఫ్ 'రఘువీర్ రాథోడ్'గా ఒక పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తుండగా, బిజు మీనన్, ఖుష్బూ సుందర్, అశుతోష్ రాణా, గురు సోమసుందరం, రాజీవ్ కనకాల వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రవి బస్రూర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరియు భువన్ గౌడ విజువల్స్ ఈ గ్లింప్స్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం 5 భాషల్లో ప్రపంచవ్యాప్తంగా జూన్ 11, 2027న థియేటర్లలోకి రానుంది.



## దురంధర్-2పై హైకోర్టులో వ్యాజ్యం

బాక్సాఫీసు వద్ద రికార్డు సృష్టించిన 'ధురంధర్ 2' కు ఇప్పుడు ఓ చిక్కు ఎదురైంది. ఈ సినిమాలో సాయుధ దళాల కార్యకలాపాల వివరాలను బహిర్గతం చేశారని, దీనివల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందంటూ దిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. సశస్త్ర సీమా బల్ లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దీపక్ కుమార్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఆ సినిమా కల్పిత కథ కావచ్చుని, కానీ భద్రతాదళ సిబ్బంది లేవనెత్తిన ఆందోళనలనూ విస్మరించలేమని వ్యాఖ్యానించింది. ఈ ఆరోపణలపై విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ని ఆదేశించింది. ఈ సినిమా స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన సంగతి తెలిసిందే. రణ్‌వీర్ సింగ్ హీరోగా దర్శకుడు ఆదిత్యధర్ తెరకెక్కించిన ఈ చిత్రం మార్చిలో విడుదలై, రూ.1800 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. విదేశాల్లో ఇప్పటికే 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ మూవీ.. భారత్‌లో జూన్ 5 నుంచి ఓటీటీ 'జియో హాట్‌స్టార్'లో స్ట్రీమింగ్ కానుంది. జూన్ 4న రాత్రి 7గంటలకు డిజిటల్ ప్రీమియర్ ఉండనుంది.

## బాలకృష్ణ మూవీలో మంచు మనోజ్





'వీర సింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత బాలయ్య, గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతోన్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నటుడు మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్న దర్శకుడు, మనోజ్ పోషించబోయే పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని, థియేటర్లలో ఆ మ్యాజిక్‌ను ప్రేక్షకులు ఎప్పుడు చూస్తారా అని తాను ఎంతగానో ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. కాగా ఈ సినిమాలో మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. గతంలో 'ఊ..కొడతారా ఉలిక్కిపడతారా' చిత్రంలో కలిసి నటించిన బాలకృష్ణ, మంచు మనోజ్ మళ్లీ కలిసి నటిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ భారీ బడ్జెట్ మూవీలో బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తుండటం విశేషం. ఇందులో బాలయ్య సరసన కథానాయికగా నయనతార నటిస్తున్నారు. 'సింహా', 'శ్రీరామరాజ్యం', 'జైసింహా' వంటి ఘనవిజయాల తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న నాలుగో చిత్రం ఇది కావడంతో ఈ జంట మరోసారి బాక్సాఫీస్ వద్ద మేజిక్ రిపీట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఎస్.ఎస్. తమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండగా.. వృద్ధి సినిమాస్ ఈ సినిమాను నిర్మిస్తుంది.

## ఫిలిం ఛాంబర్ పదవికి సునీల్ నారంగ్ రాజీనామా



తెలంగాణ చిత్ర పరిశ్రమలో ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష పదవికి ప్రముఖ డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్, ఏషియన్ మల్టీప్లెక్స్‌ల అధినేత, నిర్మాత సునీల్ నారంగ్ హఠాత్తుగా రాజీనామా చేశారు. కేవలం వ్యక్తిగత కారణాల వల్లే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంటూ ఆయన ఫిలిం ఛాంబర్‌కు అధికారికంగా ఈమెయిల్ ద్వారా తన రాజీనామా లేఖను పంపించారు. సునీల్ నారంగ్ సమర్పించిన ఈ రాజీనామాను ఫిలిం ఛాంబర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ అత్యవసరంగా సమావేశమై ఆమోదించింది.అయితే, చిత్ర పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ రాజీనామా వెనుక టాలీవుడ్‌లో గత కొంతకాలంగా నడుస్తున్న 'పర్సంటేజీ విధానం' వివాదమే ప్రధాన కారణమని తెలుస్తోంది. థియేటర్ల నిర్వహణ ఖర్చులు పెరిగిపోవడంతో సింగిల్ స్క్రీన్ థియేటర్లలో కూడా మల్టీప్లెక్స్‌ల తరహాలోనే కలెక్షన్ల పర్సంటేజీ సిస్టమ్ (షేరింగ్ విధానం) అమలు చేయాలని ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్నారు. కానీ, టాలీవుడ్‌కు చెందిన పలువురు అగ్ర నిర్మాతలు మాత్రం ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ వివాదం రోజురోజుకూ ముదరడం, ఎగ్జిబిటర్ల తరఫున నిలబడిన సునీల్ నారంగ్‌పై కొంతమంది నిర్మాతల నుండి తీవ్ర ఒత్తిడి, విమర్శలు రావడంతోనే ఆయన తీవ్ర అసంతృప్తితో పదవి నుంచి తప్పుకున్నట్లు ఫిలిం నగర్‌లో గట్టిగా వినిపిస్తోంది.ఈ హఠాత్ పరిణామంతో ఖాళీ అయిన అధ్యక్ష స్థానాన్ని భర్తీ చేసేందుకు ఫిలిం చాంబర్ వర్గాలు వేగంగా అడుగులు వేస్తున్నాయి. ప్రస్తుత సమాచారం ప్రకారం, రేపు తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ నూతన అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు ప్రత్యేకంగా ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టాలీవుడ్‌లో థియేటర్ల యజమానులకు, నిర్మాతలకు మధ్య పంతాలు నడుస్తున్న ప్రస్తుత తరుణంలో రాబోయే కొత్త అధ్యక్షుడు ఈ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తారనేది ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది.

## మహేష్ బాబు ఫ్యామిలీ నుంచి మరో బ్యూటీ



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు మేనకోడలు, నటి-దర్శకురాలు మంజుల ఘట్టమనేని కూతురు జాన్వీ స్వరూప్ ఘట్టమనేని గుర్తున్నారా? తాజాగా ఈ యంగ్ బ్యూటీ కార్‌లో దిగిన కొన్ని అందమైన ఫోటోలను ఆమె తల్లి మంజుల సోషల్ మీడియాలో షేర్ చేశారు. లైట్ బ్లూ ట్యాంక్ టాప్, బ్లాక్ కార్గో ప్యాంట్స్‌తో క్యాజువల్ స్ట్రీట్ వేర్ లుక్‌లో జాన్వీ మెరిసిపోతోంది. ఈ ఫోటో షూట్ చూసిన నెటిజన్లు ఘట్టమనేని మూడో తరం వారసురాలు హీరోయిన్ మెటీరియల్ అంటూ తెగ పొగిడేస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం..ఘట్టమనేని ఫ్యామిలీ నుండి మరో క్రేజీ ఎంట్రీ: తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఘట్టమనేని ఫ్యామిలీకి ఒక ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. లెజెండరీ నటుడు కృష్ణ గారి వారసత్వాన్ని మహేష్ బాబు సూపర్ స్టార్‌గా ముందుకు తీసుకెళ్తున్నారు. ఇప్పుడు అదే ఫ్యామిలీ నుండి మూడో తరం వెండితెరపై సందడి చేయడానికి రెడీ అవుతోంది. ఇప్పటికే రమేష్ బాబు కుమారుడు సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చేసాడు. త్వరలో అతని మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. వారితో పాటే మంజుల కుమార్తె జాన్వీ స్వరూప్ కూడా హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వడానికి గ్రాండ్‌గా ప్లాన్ చేసుకుంటోంది.

## చిరంజీవి గొప్ప మనసు..

### ఎప్‌సెట్ టాపర్‌ను సత్కరించిన మెగాస్టార్



"నువ్వు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకో.. నిన్ను మెగాస్టార్ చిరంజీవి దగ్గరకు తీసుకెళ్లి ఆశీర్వాదం ఇప్పిస్తా" అని ఒక తండ్రి తన కూతురికి ప్రామిస్ చేశారు. పట్టుదలతో కష్టపడి చదివిన ఆ అమ్మాయి తెలంగాణ ఎప్‌సెట్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచింది. తాజాగా ఆ 'మెగా' కల కూడా నిజమైంది.

తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో సంచలనం సృష్టించిన ఎం.రుషి వెనక ఓ ఆసక్తికరమైన కథ ఉంది. రుషి తండ్రి చిన్నప్పటి నుంచి చిరంజీవికి పెద్ద అభిమాని. రుషికి కూడా మెగాస్టార్ అంటే చాలా ఇష్టం. దీంతో ఎప్‌సెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధిస్తే స్వయంగా ఆయన దగ్గరకు తీసుకెళ్లి కల్పిస్తానని తండ్రి మాటిచ్చారు. కష్టపడి చదివిన రుషి స్టేట్ టాపర్‌గా నిలిచింది.రుషి సాధించిన ఈ విజయం సాధారణమైనది కాదు. ఇంజినీరింగ్ విభాగంలో గత 40 ఏళ్లుగా (1986 తర్వాత) స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఏకైక అమ్మాయిగా రుషి రికార్డు సృష్టించింది. మగపిల్లలదే హవా అనుకునే ఈ విభాగంలో ఓ అమ్మాయి టాపర్‌గా నిలవడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.తనను కలవడానికి వచ్చిన ఈ యంగ్ అచీవర్‌కు మెగాస్టార్ చిరంజీవి ఘన స్వాగతం పలికారు. రుషి సాధించిన అద్భుతమైన విజయాన్ని అభినందిస్తూ ఆమెను శాలువాతో సత్కరించారు. ల్యాప్‌టాప్ బహుమానంగా ఇచ్చారు. ఇంత చిన్న వయసులోనే తండ్రి మాట కోసం అంతటి కఠినమైన పరీక్షలో టాప్ ర్యాంక్ సాధించడం గొప్ప విషయమని కొనియాడారు.ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత సివిల్స్ రాసి ఐఏఎస్ అధికారిణి కావాలన్నదే తన లక్ష్యమని రుషి చిరంజీవికి వివరించింది. ఆమె సంకల్పాన్ని విన్న మెగాస్టార్ ఎంతో సంతోషించారు. రుషి చదువును ఆపొద్దని.. తన నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా మొహమాటం లేకుండా అడగాలని భరోసా ఇచ్చారు.